www.prajamantalu.com

సంపుటి : 5
సంచిక : 13
పేజీలు : 8
వెల : రూ. 4





# ప్రజా మంటలు

Prajamantalu Jagtial

మాఅక్షరాలు – నిజాల నిప్పుకణికలు

ఎడిటర్ : సిహెచ్.వి ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

గురువారం 14 మార్చి 2024


## వైద్యశాఖ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి



- ఖాళీగా ఉన్న 4,356 పోస్టులకు గ్రీన్ సిగ్నల్
- కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ

హైదరాబాద్, మార్చి 13 (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్రం వైద్య శాఖలో ఖాళీలను భర్తీకి చేయడానికి ఆర్థిక శాఖ అనుమతిస్తూ మార్చి 12న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఉన్న 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 పోస్టులను కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సూచనల మేరకు ఈ నోటిఫికేషన్ విడుదల కానుంది. జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశాక.. వాటిలో బోధనా సిబ్బందిని నిమించేందుకు మిగతా 2లో..

## మహిళా ఓట్లే లక్ష్యంగా
# వరాల వర్షం

- నారీ న్యాయ్ గ్యారెంటీని ప్రకటించిన కాంగ్రెస్
- పేద మహిళలకు ఏటా లక్ష రూపాయల బదిలీ



న్యూఢిల్లీ,మార్చి13 (ప్రజా మంటలు): మహిళా ఓట్లే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ వరాల వర్షం కురిపించింది. స్త్రీల సంక్షేమమే లక్ష్యంగా నారీ న్యాయ్ గ్యారెంటీని ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ హామీల వర్షం కురిపిస్తోంది. తాజాగా మహిళలకు ప్రత్యేకంగా ఐదు గ్యారెంటీలను ప్రకటించింది. పేద కుటుంబాల్లోని మహిళలకు ఏటా రూ.లక్ష నగదును బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కొత్తగా చేపట్టే నియామకాల్లో నారీమణులకు 50శాతం కోటా ఇవ్వనున్నట్లు మిగతా 2లో..

## రేపు ఎల్బీ స్టేడియంలో సీఎం ఇఫ్తార్ విందు

హైదరాబాద్, మార్చి 13 (ప్రజా మంటలు): ముస్లీముల పవిత్ర రంజాన్ మాసంలో రేపు ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఇఫ్తార్ విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ముఖ్యమంత్రి హాజరయ్యే ఇఫ్తార్ విందు నిర్వహణ మిగతా 2లో..

## ఇకనుంచి వాహన రిజిస్ట్రేషన్‌లలో టిజి

కేంద్ర ఉపరితల రవాణాశాఖ నోటిఫికేషన్ జారీ 2లో..

# బీజేపీ రెండో జాబితా విడుదల

- జాబితాలో 72 మందికి చోటు
- తెలంగాణ నుంచి మరో ఆరుగురికి స్థానం
- ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపి సోమం బాపూరావుకు చేయి
- మాజీ ఎంపి గోడం నగేశ్‌కు అవకాశం
- మహబూబ్‌నగర్‌లో డికె అరుణ, మెదక్‌లో రఘునందన్
- మహబూబాబాద్‌లో సీతారాం నాయక్...నల్లగొండలో సైదిరెడ్డి
- పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్
- జితేందర్ రెడ్డిని పక్కన పెట్టిన బిజెపి అధిష్టానం

న్యూఢిల్లీ,మార్చి13 (ప్రజా మంటలు): బీజేపీ రెండో జాబితా విడుదలైంది. 72 మందితో కూడిన సెకండ్ లిస్టును ప్రకటించగా తెలంగాణ నుంచి ఆరుగురికి చోటు లభించింది. మెదక్ నుంచి రఘునందన్ రావు, నల్గొండ నుంచి సైదిరెడ్డి, పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్, ఆదిలాబాద్ నుంచి గోడం నగేశ్, మహబూబాబాద్ సీతారం నాయక్, మహబూబ్ నగర్ నుంచి డీకే ఆరుణ పేర్లను బీజేపీ ప్రకటించింది. ఇప్పటికే ఫస్ట్ లిస్టులో 9 సీట్లకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ తాజా జాబితాతో తెలంగాణలో మొత్తం 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వరంగల్, ఖమ్మం స్థానాలను మిగతా 2లో..



## కెసిఆర్ అత్యాశకు కాళేశ్వరం బలి

- అవినీతి అన్నారం,సుందిళ్లకు కూడా పాకింది
- వెన్నముకలాంటి మేడిగడ్డ కుంగితే పన్నుతో పోలికా
- సమస్యను చిన్నదిగా చేయడం దుర్మార్గం
- కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మార్చి 13 (ప్రజా మంటలు): ఒక పన్ను పాడైతే మిగతా అన్ని పళ్లు పీకేసుకుంటామా? ఎన్నికల్లో ప్రజలు అత్యాశకు పోయారా? ముఖ్యమంత్రి భాషపై కరీంనగర్ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు తప్పు అని తెలంగాణ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం అన్నారు. కేసీఆర్ చెప్పినట్లుగా పాడైంది పన్ను అయితే బాగుండేదని పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. కానీ కేసిఆర్ అవినీతికి బలైంది కాళేశ్వరానికి వెన్నెముకలాంటి మేడిగడ్డ అని అన్నారు. మనిషికి వెన్నెముక ఎంత ముఖ్యమో కాళేశ్వరం ప్రాజెక్టుకు మేడిగడ్డ కూడా అంతే ముఖ్యమని అన్నారు. వెన్నెముక విరిగిపోతే శరీరం ఎలా ఉంటుందో ఇప్పుడు కాళేశ్వరం పరిస్థితి కూడా అలాగే ఉందని పొంగులేటి అన్నారు. అపర మేధావి కేసీఆర్ సమస్యను చిన్నదిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎత్తిపోతల, తిప్పిపోతల అంటూ కాళేశ్వరం ప్రాజెక్ట్ వెన్నెముక అయిన మేడిగడ్డ బ్యారేజీ మొత్తం 22 పిల్లర్లలో దాదాపు 7 పిల్లర్లు 3 ఫీట్ల మేరకు కుంగిపోయాయని అన్నారు. ఈ విషయాన్ని ఎన్‌ఎస్డీఏ, కేంద్ర ప్రభుత్వ జల వనరుల నిపుణులు, మన ప్రభుత్వ నిపుణులు, రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులు, మేధావులు, రైతు సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు, వివిధ పత్రికల ఎడిటర్లు, జర్నలిస్ట్ లు ఇలా ప్రజలు అందరూ ఏకరువు పెడుతున్నారని అన్నారు. ప్రజలు అత్యాశకు పోయారని ప్రజాతీర్పును కేసీఆర్ చులకన చేస్తున్నారని, తనకు ఓటు వేసినంత కాలం ప్రజలు మంచివారు, వ్యతిరేకంగా ఓటు వేస్తే మాత్రం ప్రజలకు తెలివి లేదు



మూర్ఖులు అన్నట్లుగా కేసీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పును ఆమోది స్తున్నామని ఈరోజు వరకు కేసీఆర్ నోటినుండి వెలువడిందా? ప్రజా తీర్పును ప్రశ్నించేలా కేసీఆర్ మాట్లాడడం ఎంత వరకు సమంజసం అన్నారు.కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోను కాపీ చేసి 400కు సిలిండర్ ఇస్తానంటే కూడా మిగతా 2లో..

## కేంద్ర ఎన్నికల సంఘంలోకి ఇద్దరు కొత్త కమిషనర్లు

### డాక్టర్ రాజేష్ కుమార్ గుప్తా, ప్రియాన్ష్ శర్మల నియామకం

### కేంద్ర నిర్ణయానికి రాష్ట్రపతి ముర్ము ఆమోదముద్ర

న్యూఢిల్లీ,మార్చి13 (ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఖాళీగా ఉన్న స్థానాల్లో ఇద్దరు ఎన్నికల కమిషనర్లను ప్రభుత్వం నియమించింది. వీరి నియామకానికి సంబంధించి బుధవారం నాడు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ రాజేష్ కుమార్ గుప్తా (రిటైర్డ్ ఐఏఎస్), ప్రియాన్ష్ శర్మ (రిటైర్డ్ ఐఏఎస్) లను నూతన ఎన్నికల కమిషనర్లుగా నియమించింది.కేంద్ర మిగతా 2లో..




2లో

## ఈసీల నియామకాలపై వివాదం వేళ..

- 15న సుప్రీం అత్యవసర విచారణ

## సీఏఏపై మండిపడ్డ కేజ్రీవాల్

- ఓటు బ్యాంకు రాజకీయాలు వద్దని హితవు
- రాజ్యాంగ విరుద్ధం:మమత
- సీఏఏపై అసత్య ప్రచారాలు ఆపండి
- ప్రతిపక్షాలకు భాజపా సూచన



న్యూఢిల్లీ,మార్చి13 (ప్రజా మంటలు): పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుపై దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎన్నికలకు ముందు ఓటు బ్యాంకు రాజకీయాలే లక్ష్యంగా కేంద్రం సీఏఏను అమల్లోకి తెచ్చిందని విమర్శించారు.'ఇదో మురికి ఓటు బ్యాంకు రాజకీయం. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వలసదారులకు పౌరసత్వం ఇచ్చి వారికి భాజపా బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో ఆశ్రయం కల్పిస్తుంది. దీనివల్ల భవిష్యత్‌లో భాజపాకు ఓటు బ్యాంకు పెరుగుతుంది. వారి రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు'.'ఇప్పటికే దేశంలో ఉన్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం సమస్యలను పరిష్కరించకుండా కేంద్రం సీఏఏ గురించి మాట్లాడుతోంది. 2014కు ముందు భారత్‌కు వచ్చిన వారికి పౌరసత్వం ఇస్తామంటున్నారు. కాని ఒకసారి తలుపులు తెరిచిన తరువాత మిగిలినవారు ఊరుకుంటారా... పెద్ద సంఖ్యలో వలసదారులు భారతదేశంలోకి రావడం ప్రారంభిస్తారు. మూడు దేశాల్లో 30 మిలియన్లకు పైగా మైనారిటీలు నివసిస్తున్నారు. 15 మిలియన్ల మంది భారత్‌కు వచ్చినా వారు ఎక్కడ స్థిరపడతారు, వారికి ఉద్యోగాలు ఎవరు ఇస్తారు. ఇది దేశానికి ప్రమాదకరం. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు ప్రభావితం అయ్యే అవకాశముందన్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులు రావడం వల్ల అస్సాం ప్రజల భాష, సంస్కృతి ఇబ్బందుల్లో పడ్డాయని" ఆయన

## దేశ ప్రాధాన్యాలు గుర్తించడంలో కాంగ్రెస్ విఫలం

- సెమీ కండక్టర్ తయారీ పరిశ్రమ ఏర్పాటులో జాప్యం
- రానున్న రోజుల్లో అగ్రగామిగా నిలవనున్న భారత్
- సెమీకండక్టర్ ప్లాంట్‌లకు ప్రధాని మోడీ శంకుస్థాపన

న్యూఢిల్లీ,మార్చి13 (ప్రజా మంటలు): దేశ భవిష్యత్తు అవసరాలు, ప్రాధాన్యాలను గుర్తించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రధాని మోదీ విమర్శించారు. అందువల్లే దేశంలో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలు నెలకొల్పడంలో జాప్యం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. బుధవారం రూ.1.25 లక్షల కోట్లు విలువైన సెమీకండక్టర్ ప్లాంట్‌లకు ప్రధాని మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులోభాగంగా గుజరాత్‌లో రెండు, అస్సాంలో ఒకటి ఏర్పాటు కానున్నాయి. తొలిసారిగా 1960లో సెమీ కండక్టర్ల తయారీ



## సార్వత్రికానికి సర్వం సిద్ధం

- ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం
- గడువులోగా 'బాండ్ల' వివరాలు వెల్లడిస్తాం
- సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడి

జమ్మూ( మార్చి13 (ప్రజా మంటలు): ఎలక్టోరల్ బాండ్ల వివరాలను గడువులోగా బహిర్గతం చేస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. ఎస్‌బీఐ నుంచి ఆ సమాచారం అందిన విషయాన్ని ధ్రువీకరించారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం, మార్చి 15 సాయంత్రంలోగా వీటిని ఈసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాల్సి ఉంది. ఇందుకు సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే ఈసీకి సదరు డేటాను అందించింది. "2024 లోక్‌సభ ఎన్నికలకు మేం సిద్ధంగా ఉన్నాం. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూస్తాం. ఈ ప్రజాస్వామ్య పండగలో ప్రతిఒక్కరూ ఎంతో ఆసక్తిగా పాల్గొనాలని జమ్మూ కశ్మీర్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లందరికీ విజ్ఞప్తి చేస్తున్నా" అని సీఈసీ రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు. తప్పుడు వార్తలపై () మిగతా 2లో..



## కెసిఆర్‌తో ఆరూరి రమేశ్ భేటీ

- తాను బిఆర్ఎస్‌లోనే ఉన్నానని వెల్లడి
- అమిత్‌షాను కలవలేదని స్పష్టీకరణ




హైదరాబాద్, మార్చి 13 (ప్రజా మంటలు): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పార్టీ మార్పు వార్తలపై ఉత్కంఠ వీడింది. కేసీఆర్‌తో సమావేశం అనంతరం తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని ఆరూరి రమేష్ ప్రకటించారు. ముఖ్యంగా తాను బీజేపీ అగ్రనేత అమిత్ షాను కలవలేదని చెప్పారు. బుధవారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించి బీజేపీలో చేరాలని ఆరూరి రమేష్ భావించారని వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. కానీ ఇంతలోనే అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ నేతలు ఆరూరికి నచ్చజెప్పారు. అంతేకాకుండా ఆరూరి రమేష్‌ను వెంటబెట్టుకుని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఇంటికి చేరుకున్నారు. మిగతా 2లో..

### ఆరూరి రమేశ్ ఇంటివద్ద హైడ్రామా

- రమేశ్ మీడియా సమావేశాన్ని అడ్డగింత
- పార్టీ మారవద్దంటూ ఎర్రబెల్లి, సారయ్యల వినతి
- బలవంతంగా ఆరూరిని కారులో ఎక్కించుకుని వెళ్లిన ఎర్రబెల్లి
- పెంబర్తి వద్ద ఎర్రబెల్లి కారును అడ్డుకున్న బిజెపి కార్యకర్తలు

హన్మకొండ,మార్చి13 (ప్రజా మంటలు):బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ ఇంటి వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. బిజేపీలో చేరేందుకు నిర్ణయించుకుని, ప్రెస్ మీట్ పెట్టిన ఆరూరిని బిఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్సీ సారయ్య మిగతా 2లో..

## ప్రజా నాడి




## మరో రెండు సీట్లకు కెసిఆర్ అభ్యర్థుల ప్రకటన

- చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశం
- వరంగల్ స్థానంలో కడియం తనయ డాక్టర్ కావ్యకు ఛాన్స్
- పార్టీ ముఖ్యనేతలతో చర్చించి నిర్ణం తీసుకున్న అధినేత



హైదరాబాద్, మార్చి 13 (ప్రజా మంటలు): వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మరో రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్యను, చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్లను ప్రకటించారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో చర్చించి వారి అభిప్రాయాలకు అనుగుణంగా కేసీఆర్ అభ్యర్థులను ఎంపిక చేశారు. తొలి జాబితాలో బీఆర్ఎస్ పార్టీ నలుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్ (ఎస్టీ రిజర్వ్) స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత, కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి (ఎస్సీ రిజర్వ్) స్థానం నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఇప్పటికే ఖరారు చేశారు. లోక్‌సభ ఎన్నికల కార్యాచరణపై భారాస అధినేత కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. వరంగల్ నియోజకవర్గ పరిధిలోని నేతలతో బుధవారం సమావేశమయ్యారు. ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి,


### పార్టీ వీడుతున్నట్లుగా దుష్ప్రచారం: కడియం శ్రీహరి



హైదరాబాద్, మార్చి 13 (ప్రజా మంటలు): తాను బీఆర్ఎస్ పార్టీ వీడుతున్నట్లు వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి స్పందించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. తాను పార్టీ మారడం లేదని.. కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని కడియం శ్రీహరి వెల్లడించారు. బీఆర్ఎస్‌లో ఎవరూ పార్టీని వీడటం లేదని ఆయన తెలిపారు. పార్టీలో ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

## ఉక్రెయిన్‌కు మద్దతిస్తే అణుయుద్ధమే..

### - పశ్చిమ దేశాలకు పుతిన్ వార్నింగ్



మాస్కో మార్చి13 (ప్రజా మంటలు): ఉక్రెయిన్‌కు మద్దతుగా అమెరికా సైన్యాన్ని పంపితే అణుయుద్ధం తప్పదని రష్యా అధ్యక్షుడు పుతిన్ పశ్చిమ దేశాలను హెచ్చరించారు. మార్చి 15-17 మధ్య రష్యా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. అకారణంగా ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలు ఉపయోగించాల్సిన అవసరం రష్యాకు లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు."సాంకేతికంగా అణు యుద్ధానికి రష్యా సిద్ధంగా ఉంది. కానీ, అందుకు తొందరపడటం లేదు. మాకు కొన్ని విధివిధానాలున్నాయి. ఈ విషయం అమెరికాకు తెలుసు. ఒకవేళ ఉక్రెయిన్‌కు మద్దతుగా సైన్యాన్ని పంపితే.. యుద్ధంలో ఆ దేశం నేరుగా జోక్యం చేసుకున్నట్లే. దానికి తప్పకుండా బదులిస్తాం. రష్యా-అమెరికా మధ్య సంబంధాలను వ్యూహాత్మక చర్చలు జరిపేందుకు చాలామంది నిపుణులు ఉన్నారు" అని పుతిన్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు రష్యా సుముఖంగా ఉందని ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు. అయితే, ఆ చర్చలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా జరగాలన్నారు. ఒకవేళ అమెరికా అణు పరీక్షలు చేపడితే.. రష్యా కూడా వాటిని పరీక్షిస్తుందని పుతిన్ తెలిపారు. ఉక్రెయిన్‌పై సైనిక చర్య ప్రారంభమైన నాటినుంచి ఆ దేశానికి మద్దతుగా

మొదటి పేజీ తరువాయి

# బీజేపీ రెండో జాబితా విడుదల

పెండింగ్ లో పెట్టింది. వరంగల్ నుంచి ఆరూరి రమేష్ పేరు ఖరారు అయినప్పటికీ చివరి నిమిషంలో ఆయన కేసీఆర్ తో భేటీ అయ్యారు. ఇక ఖమ్మం నుంచి జలగం వెంకట్రావ్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు, మహబూబ్ నగర్ సీటు ఆశించిన జితేందర్ రెడ్డిలకు అధిష్టానం బిగ్ షాకిచ్చింది. మొత్తం 10 రాష్ట్రాలతో పాటు దాద్రా నగర్ హవేలికి సంబంధించిన అభ్యర్థులనూ బీజేపీ ప్రకటించింది. ఢిల్లీ(2), గుజరాత్(7), హరియాణా(6), హిమాచల్ ప్రదేశ్(2), కర్ణాటక(20), మధ్యప్రదేశ్(5), మహారాష్ట్ర(20), త్రిపుర(1), ఉత్తరాఖండ్(2), దాద్రా నగర్ హవేలి(1) స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. బీజేపీ ఇప్పటికే ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాని విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం 195 మంది అభ్యర్థులతో కూడిన ఆ తొలి జాబితాలో తెలంగాణ నుంచి మొత్తం 9 మంది చోటు సంపాదించారు. ఇప్పుడు తాజాగా ఆ పార్టీ 72 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాని విడుదల చేసింది. ఇందులో ఆరుగురు తెలంగాణ అభ్యర్థులు స్థానం దక్కించుకున్నారు. ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపిని కాదని బిఆర్ఎస్ నుంచి వచ్చి చేరిన మాజీ ఎంపి గోడం నగేశ్‌కు స్థానం కల్పించారు. అలాగే మహబూబాబాద్‌లో కూడా మాజీ ఎంపి సీతారాం నాయక్ ఇటీవలే బిజెపిలో చేరగా ఆయనకు కూడా టిక్కెట్ కేటాయించారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే శానం సైదిరెడ్డికి టిక్కెట్ ఇవ్వడం గమనార్హం. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారికే టిక్కెట్లు కేటాయించారు. అందరూ ఊహించినట్లుగానే మెదక్ ఎంపి సీటును రఘునందన్ రావుకు కేటాయించారు. ఇప్పటికే మల్కాజిగిరి స్థానాన్ని ఈటెల రాజేందర్‌కు కేటాయించారు.

## మహిళా ఓట్లే లక్ష్యంగా వరాల వర్షం

తెలిపింది .ఈ పథకాల ద్వారా ఏటా పేద కుటుంబాలకు చెందిన మహిళలకు రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చింది. మహాలక్ష్మి, ఆధి ఆబది పూరా హక్, శక్తి కా సమ్మాన్, అధికార్ మైత్రి, సావిత్రీబాయి పూలే హాస్టల్ వంటి ఐదు గ్యారెంటీలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో జరిగే కొత్త రిక్రూట్‌మెంట్లలో సగానికిపైగా మహిళలకు ÷ుజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివరాలు వెల్లడించారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల నెలవారీ ఆదాయానికి కేంద్ర ప్రభుత్వ సహకారం రెట్టింపు చేయనున్నారు. మహిళలకు వారి హక్కులపై అవగాహనతో పాటు సాధికారత కల్పించేందుకు ప్రతి పంచాయతీలో ఒక పారాలీగల్ ప్రొఫెషనల్‌ను నియమించనుంది. శ్రామిక మహిళలకు సురక్షితమైన ఆవాసం కల్పించేందుకు జిల్లా ప్రధాన కార్యాలయంలో పనిచేసే మహిళలకు ఒక హాస్టల్‌ను నిర్మించనుంది. 'నారీ న్యాయ్' పేరుతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ హామీని ప్రకటించారు. అటు మహారాష్ట్రలో 'భారత్ జోడో న్యాయ్‌యాత్ర'లో ఉన్న రాహుల్ గాంధీ కూడా ఈ గ్యారెంటీకి సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇందులో మొత్తం ఐదు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రకటించింది.

# కెసిఆర్ అత్యాశకు కాళేశ్వరం బలి

కేసీఆర్ హామీలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. మేడిగడ్డ తర్వాత అన్నారం సుందిళ్ల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని పొంగులేటి అన్నారు. కేసీఆర్ అవినీతి జబ్బు ఒక మేడిగడ్డకే పరిమితం కాలేదని.. అన్నారం సుందిళ్ళకు కూడా పాకిందని అన్నారు. తానే ఇంజనీర్, తానే డిజైనర్, తానే తాపీ మేస్త్రి అనే విధంగా వ్యవహరించారని కాళేశ్వరం కెసిఆర్ అవినీతి అహంకారానికి మూర్ఖత్వానికి నిదర్శనం అని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ తర్వాత అన్నారం బ్యారేజీ, సుందిళ్ల ప్రాజెక్టుల పరిస్థితి కూడా చాలా ఆందోళనకరంగా ఉంది. కేసీఆర్ అవినీతి జబ్బు ఒక మేడిగడ్డకే పరిమితం కాలేదు. ఆ జబ్బు అన్నారం సుందిళ్ళకు కూడా పాకింది. తానే ఇంజనీర్, తానే డిజైనర్, తానే తాపీ మేస్త్రి అనే విధంగా వ్యవహరించారు. కాళేశ్వరం కేసీఆర్ అవినీతి అహంకారానికి మూర్ఖత్వానికి నిదర్శనం' అని పొంగులేటి విమర్శించారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలు పాల్గొనకుండా పారిపోయిన పెద్దమనిషి 80వేల పుస్తకాలు చదివిన మేధావి కాళేశ్వరం రూపశిల్పి ఇప్పుడు టీవీల ముందుకు వచ్చి మాట్లాడుతారంట అని ఎద్దేవా చేశారు. భూమి ఆకాశం ఉన్నన్నిరోజులు బీఆర్ఎస్ ఉంటుందన్న కేసీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. టీఆర్ఎస్ స్థానంలో కెసిఆర్ ఏర్పాటు చేసిన భారత రాష్ట్ర సమితి పరిస్థితి ఏమైందో అందరికీ తెలుసని, దేశంలో గత్తెర లేప్త భూకంపం సృష్టిస్తా అని చెప్పిన వ్యక్తి దేశంలో ఏ ఒక్క రాష్ట్రంలో పోటీ చేయలేక చేతులెత్తేయగా, ఉన్న రాష్ట్రంలో ప్రజలు కెసిఆర్ కుర్చీ మడత పెట్టారని, రాబోయే రోజుల్లో ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా బీఆర్ఎస్ కు అభ్యర్థులు దొరకలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన పాలనపరమైన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. కరువుకు కాంగ్రెస్ పార్టీకి ఏమైనా సంబంధం ఉందా ? మా ప్రభుత్వం డిసెంబర్ 7వ తేదీన ఏర్పడిందని, అప్పటికే వర్షాకాలం సీజన్ ముగిసిందనే విషయాన్ని కేసీఆర్ గుర్తుంచుకోవాలని పొంగులేటి అన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘంలోకి ఇద్దరు కొత్త కమిషనర్లు

ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల నియామక చట్టం 2023 ప్రకారం.. ఉన్నతస్థాయి కమిటీ ఇద్దరు కమిషనర్లను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీలో సభ్యులుగా భారత ప్రధాన మంత్రి, లోక్‌సభ విపక్ష నేత, కేంద్ర హోంమంత్రి సభ్యులుగా ఉంటారు. బుధవారం అంటే మార్చి 13వ తేదీ నుంచే ఈ కమిషనర్ల నియామకం అమల్లోకి వస్తుంది. వీరి నియామకానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్రవేశారు. కాగా, కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ సహా మరో ఇద్దరు కమిషనర్లు ఉంటారు. వీరిలో ఒక కమిషనర్ గతంలోనే రాజీనామా చేయగా.. ఇటీవల అరుణ్ గోయెల్ సైతం తన కమిషనర్ పదవికి రాజీనామా చేశారు. దాంతో ఎన్నికల సంఘంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మాత్రమే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల సంఘం ఖాళీ అవడంతో.. కొత్తగా ఇద్దరు కమిషనర్లను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# రేపు ఎల్బీ స్టేడియంలో సీఎం ఇఫ్తార్ విందు

ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ నేడు సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గా రంజాన్ తొలి శుక్రవారం నాడైన 15 న సీఎం రేవంత్ రెడ్డి ముస్లిమ్ సోదరులకు ఇఫ్తార్ విందు ఇస్తున్న సందర్భంగా విస్తృత ఏరాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రంజాన్ మొదటి శుక్రవారం సందర్భంగా ఎల్.బి స్టేడియం లో ముస్లిమ్ సోదరులకు సాయంత్రం ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. ఇఫ్తార్ విందులో ముస్లిమ్ సోదరులు నమాజ్ చేయుటకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇఫ్తార్ లో పాల్గొనే ప్రతి ఒక్కరికి భోజన సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. త్రాగు నీరు, మొబైల్ టాయిలెట్స్ తదితర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సంబంధిత అధికారులను కోరారు. ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన వారిలో కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, జి.హెచ్.యం.సి కమిషనర్ రోనాల్డ్ రోస్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు, నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ , మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్, కాంతి వెస్లీ, రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లాహ్ హుస్సేనీ, తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ , క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపాక్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసీల నియామకాలపై వివాదం వేళ..

## - 15న సుప్రీం అత్యవసర విచారణ

న్యూఢిల్లీ,మార్చి13 (ప్రజా మంటలు):

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఈసీ, ఈసీల నియామకాల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాన ఎన్నికల అధికారి ఎన్నికల కమిషనర్ల నియామకాల కోసం కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు (ాబీజూతీవఎవ అనీబీతీబి)లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్ల అత్యవసర విచారణ చేపట్టాలని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ తాజాగా అభ్యర్థించింది. ఇందుకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. శుక్రవారం (మార్చి 15న) విచారణ జరుపుతామని వెల్లడించింది. కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅ)లో ఖాళీ అయిన కమిషనర్ల పోస్టులను ఈ నెల 15వ తేదీలోగా భర్తీ చేసేందుకు కేంద్రం సిద్ధమవుతున్న వేళ.. ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెల ఒక కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. ఇటీవల మరో కమిషనర్ అరుణ్ గోయెల్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. ఈ క్రమంలోనే ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్రం కసరత్తు మొదలుపెట్టింది. ప్రధాని మోదీ, కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌధరి, కేంద్ర మంత్రి సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ మార్చి 15లోగా కొత్త కమిషనర్ల పేర్లను ఖరారు చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజా నియామకాలను సవాల్ చేస్తూ ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన ఓ నేత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని కూడా శుక్రవారం విచారించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషనర్ల నియామకాలపై పార్లమెంటులో చట్టం చేసేవరకు.. ప్రధానమంత్రి నేతృత్వంలో లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కలిసి సీఈసీ, ఈసీ నియామకాలు చేపట్టాలని 2023 మార్చిలో అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకం, వారి సర్వీసు నిబంధనలకు సంబంధించి గతేడాది డిసెంబరులో కేంద్రం కొత్త చట్టం అమల్లోకి తెచ్చింది. దాని ప్రకారం.. ఈసీల నియామక బాధ్యతలను సెర్చ్, ఎంపిక కమిటీలు నిర్వహించనున్నాయి. ఎంపిక కమిటీలో సీజేఐ స్థానంలో ప్రధాని సూచించిన కేంద్రమంత్రిని చేర్చింది. దీన్ని సవాల్ చేస్తూనే సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

# వైద్యశాఖ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి

రాష్ట్రం వైద్య ఆరోగ్య శాఖ సిద్ధమైంది. మెడికల్ కాలేజ్ ల్లోని ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెండ్లు అన్ని కలిపి 4,356 పోస్టులకు త్వరలో భర్తీ చేయనున్నారు. 3,155 పోస్టులు కాంట్రాక్ట్, 1,201 మందిని గౌరవ వేతనంతో భర్తీ చేసేందుకు అనుమతులిచ్చినట్లు ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి తెలిపారు. అందులో ప్రొఫెసర్ పోస్టులు 498, అసోసియేట్ ప్రొఫెసర్ 786, అసిస్టెంట్ ప్రొఫెసర్ 1,459, ట్యూటర్లు 412, సీనియర్ రెసిడెంట్ పోస్టులు 1,201 ఉన్నాయి. కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా సత్వరమే నియామకాలు చేపట్టాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# సీఏఏపై మండిపడ్డ కేజ్రీవాల్

ఆందోళన వ్యక్తంచేశారు.వలసదారులకు పౌరసత్వం ఇవ్వడం వల్ల దేశంలోని యువతకు అందాల్సిన ఉద్యోగావకాశాలు వారికి దక్కుతాయి. వారికి ఉద్యోగాలు ఇస్తారు, ఇళ్ళు కట్టిస్తారు. మరి మన దేశ పౌరుల పరిస్థితేంటి అని కేజ్రీవాల్ కేంద్రాన్ని ప్రశ్నించారు. పాకిస్థానీయులను మన దేశంలో స్థిరపరచడానికి భాజపా ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. మన దేశ అభివృద్ధికి ఉపయోగించాల్సిన ప్రభుత్వ డబ్బును కేంద్రం పాకిస్థానీయుల స్థిరీకరణకు ఖర్చు చేయాల్సి వస్తుందని విమర్శించారు.

**సిఎఎ చట్టం రాజ్యాంగ విరుద్ధం**

**సిఎం మమతా బెనర్జీ**



పౌరసత్వ సవరణ చట్టం-2019 (-సీఏఏను కేంద్రంలోని బీజేపీ సర్కారు నోటిఫై చేయడంపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. సీఏఏ నిబంధనలు అస్పష్టంగా, రాజ్యాంగ విరుద్ధంగా, వివక్షాపూరితంగా ఉన్నాయని మండిపడ్డారు.. సీఏఏ చట్టబద్ధతపై తనకు నమ్మకం లేదని అన్నారు. ఎన్ఆర్‌సీ అమలుతో సీఏఏ ముడిపడి ఉన్నదని, ప్రజలను నిర్బంధ శిబిరాలకు తీసుకెళ్తారని, రాష్ట్రంలో సీఏఏ అమలును తాను అనుమతించబోనని తెగేసి చెప్పారు. 'సీఏఏ కింద పౌరసత్వం కోసం అప్లై చేసుకొనేటప్పుడు ఆలోచించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. ఇప్పటికే పౌరులుగా ఉన్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే వారు వెంటనే శరణార్థులుగా మారిపోతారు. మళ్లీ కొత్తగా కమిటీ దయతలచి పౌరసత్వం ఇవ్వాల్సి ఉంటుందని మమత పేర్కొన్నారు. ఎవరైతే పౌరసత్వానికి అర్హులు కారో వారిని నిర్బంధ శిబిరాలకు తరలిస్తారని మమతా బెనర్జీ వెల్లడించారు. ఇది పౌరసత్వ హక్కులను లాక్కోవడానికి బీజేపీ పన్నిన పన్నాగమని అభివర్ణించారు. ఈ దేశంనుంచి క్రిస్టియన్లు, ముస్లింలు, నామశూద్రులను వెళ్లగొట్టే కుట్ర జరుగుతున్నదని, బెంగాల్?ను విభజించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. దీన్ని తాను జరగనివ్వబోనని స్పష్టం చేశారు. శరణార్థులకు పౌరసత్వం వస్తే తనకు సంతోషమేనని, తిరస్కరించిన వారికి తాను షెల్టర్ ఇస్తానని భరోసా ఇచ్చారు.

**సీఏఏపై అసత్య ప్రచారాలు ఆపండి**



పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై విపక్షాలు అబద్దాలను ప్రచారం చేసి.. మతపరమైన విద్వేషాలను సృష్టిస్తున్నాయని భాజపా ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఈ చట్టం ప్రకారం ఎవరి పౌరసత్వాన్ని, ఉద్యోగాన్ని బలవంతంగా లాక్కోరని పేర్కొన్నారు."మూడు దేశాల్లో హింసకు గురైనా హిందు, జైనులు, సిక్కులే ఈ చట్టం కింద పౌరసత్వం పొందుతారు. వారికి చట్టబద్ధమైన మార్గాల్లో రక్షణ కల్పించడం నైతికంగా, రాజ్యాంగపరంగా, సాంస్కృతిక పరంగా విషయం కాదా..? ఓట్లపై అత్యాశతో కేజ్రీవాల్ ఎంతదూరం వెళ్లినా.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఒక విషయాన్ని స్పష్టం చేశారు. ఏ ఒక్క భారతీయుడు ఈ చట్టం కారణంగా పౌరసత్వం కోల్పోడు. దీనిపై అబద్దాలు చెప్పేవారు రోహింగ్యాలకు అనుకూలంగా నిలబడతారు" అని పేర్కొన్నాడు. దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఓట్ల కోసం ఎంతవరకైనా వెళతారని ఆరోపించారు.సీఏఏ పేరిట మతవిద్వేషాలను రెచ్చగొట్టేవారు తక్షణమే వాటిని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా తమిళనాడు, కేరళలోని పార్టీలు విద్వేష వ్యాప్తిని ఆపాలని కోరుతున్నానన్నారు. ఈ చట్టాన్ని అమలుచేయమని కొన్ని రాష్ట్రాలు చెప్పడాన్ని రవిశంకర్ ప్రసాద్ కొట్టి పారేశారు. కేంద్ర చట్టాన్ని ప్రతీ రాష్ట్రం అమలుచేయాలన్నారు.ఇటీవల కేంద్ర ప్రభుత్వం సీఏఏ అమలుచేస్తున్న విషయాన్ని ప్రకటించిన తర్వాత ఆప్ కూడా ఇండియా కూటమితో చేరి విమర్శలను ఎక్కుపెట్టింది. ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నేడు మాట్లాడుతూ సీఏఏ అమలుచేయాలన్న ప్రభుత్వ నిర్ణయం అత్యంత ప్రమాదకరమైందన్నారు. దేశంపై పడే అదనపు ఆర్థిక భారం, విదేశీల వలసల ప్రమాదంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని వ్యతిరేకించే వారు భాజపాకు ఓటు వేయవద్దని కోరారు.

# ఇకనుంచి వాహన రిజిస్ట్రేషన్‌లలో టిజి

## కేంద్ర ఉపరితల రవాణాశాఖ నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ,మార్చి13 (ప్రజా మంటలు):

వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్ లపై తెలంగాణ ప్రభుత్వం తన పంతం నెగ్గించుకుంది. రాష్ట్ర వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లను టీఎస్ నుండి టీజీకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విషయాన్ని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డా.మల్లు రవి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.తెలంగాణలో ఏర్పాటైన ప్రభుత్వం ÷ూ పేరును ÷ుఉగా మార్చాలని నిర్ణయించడం తెలిసిందే. గత కేబినెట్ భేటీలో తెలంగాణ స్టేట్ బదులుగా తెలంగాణ గవర్నమెంట్ అని మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించార. దీంతో టీఎస్ అని ఉన్న వాహనాలు, ఇతర సంస్థల పేర్లు టీజీ అని మారుస్తారా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం ఉన్న టీఎస్ నెంబర్ ప్లేట్లను మార్చుకోవాల్సిన అవసరం లేదని.. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకే నెంబర్ ప్లేట్లను ఇలా రిజిస్టర్ చేస్తారని సైతం ప్రచారం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం కోరినట్లుగానే రాష్ట్ర రిజిస్ట్రేషన్ కోడ్‌ను టిఎస్ నుంచి 'టిజిగా మార్పుచేస్తూ కేంద్ర రవాణాశాఖ గెజిట్ నోటిఫికేషన్ మంగళవారం రాత్రి విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు సైతం ఇదే తరహాలో మార్పులు జరిగాయి. అప్పటివరకూ ఉన్న ఏపీ రిజిస్ట్రేషన్లను యథావిధిగా కొనసాగిస్తామని అప్పటి ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ నెంబర్ ప్లేట్స్ తోనే 30 లక్షల వాహనాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. వాహనదారులపై భారం పడకుండా రవాణాశాఖ ఆ విధంగా వ్యవహరించింది. తెలంగాణలో ఇప్పటికే 1.50 కోట్లకు పైగా వాహనాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 10 వేల కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయి. ఇప్పటివరకూ టీఎస్ పేరిట రిజిస్ట్రేషన్ జరగగా.. ఇకనుంచి కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాల నెంబర్ ప్లేట్లపై 'టిజి'గా మార్చనున్నారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ గైడ్ లైన్స్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. వాహన రిజిస్ట్రేషన్లో టిఎస్ బదులు టిజి ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# మరో రెండు సీట్లకు కెసిఆర్ అభ్యర్థుల ప్రకటన

ఎమ్మెల్సీ మధుసూదనాచారి తదితర నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణతో పాటు అభ్యర్థిత్వంపై చర్చించారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను మాజీ మంత్రులు దయాకర్‌రావు, సారయ్య.. కేసీఆర్ నివాసానికి తీసుకొచ్చారు. అభ్యర్థి ఎంపికను కేసీఆర్ నిర్ణయానికే నేతలు వదిలిపెట్టినట్లు తెలుస్తోంది. అందరితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటానని అధినేత వారితో చెప్పినట్లు సమాచారం. వరంగల్ ఎంపీగా పోటీ చేసేందుకు ఆరూరి రమేశ్ విముఖత చూపినట్లు తెలుస్తోంది. అభ్యర్థి ఎవరైనా గెలిపించుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అనవసర నిర్ణయాలతో భవిష్యత్ పాడు చేసుకోవద్దని రమేశ్‌కు కేసీఆర్ సూచించినట్లు సమాచారం. అవకాశమిస్తే మరోసారి పోటీ చేస్తానని ఎంపీ పసునూరి దయాకర్ వెల్లడించారు. మరోవైపు పొత్తులకు సంబంధించి కేసీఆర్‌తో బీఎస్పీ నేతలు సమావేశమయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎంపీ రాంజీ గౌతమ్ భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు, సీట్ల సర్దుబాటుపై నేతలు చర్చిస్తున్నారు. మాయావతి రాయబారిగా చర్చల్లో రాంజీగౌతమ్ పాల్గొన్నారు.

## కెసిఆర్‌తో ఆరూరి రమేశ్ భేటీ

కేసీఆర్‌తో సమావేశం అనంతరం ఆరూరి రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మంగళవారం బీజేపీ అగ్రనేత అమిత్ షాను కలవలేదని తెలిపారు. అలాగే తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేశారు. తనను ఎవరూ అడ్డుకోలేదని చెప్పారు. అలాగే తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని వర్ధన్నపేట బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ చెప్పారు. జూబ్లీహిల్స్ నందినగర్ లోని కేసీఆర్ నివాసానికి చేరుకుని ఆయనతో భేటి అయిన తర్వాత ఆరూరీ రమేష్ మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కెసిఆర్ ను కలిసేందుకు పార్టీ నేతలతో పాటు హైదరాబాద్ వచ్చానని ఆయన తెలిపారు. తాను బిజెపిలో చేరుతున్నానని వస్తున్నవార్తల్లో వాస్తవం లేదన్నారు. అంతకుముందు ఉదయం ఆరూరి రమేశ్ ఇంటి వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. బిజేపీలో చేరేందుకు నిర్ణయించుకుని.. ప్రెస్ మీట్ పెట్టేందుకు ప్రయత్నించిన ఆరూరిని బిఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్సీ సారయ్య తమ కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ఆరూరి అనుచరులు వారి కారుకు అడ్డంపడ్డారు. కొంతసేపు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువైపులా పోటాపోటీ నినాదాలు కొనసాగాయి. చివరకు ఆరూరితో సహా ఎర్రబెల్లి, సారయ్య హైదరాబాద్ చేరుకుని కెసిఆర్ తో సమావేశమయ్యారు.

# ఆరూరి రమేశ్ ఇంటివద్ద హైడ్రామా

తమ కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లిపోవడంతో ఆరూరి అనుచరులు నిశ్చేష్టులయ్యారు. ఆరూరి బిజేపీలో చేరతారని కొంతకాలంగా వార్తలు వెలువడుతున్నాయి. వీటిని నిజం చేస్తూ మంగళవారం ఆయన హైదరాబాద్ లో అమిత్ షాను కలుసుకుని, పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈమేరకు తాను పార్టీలో చేరుతున్న విషయాన్ని మీడియాకు చెప్పేందుకు బుధవారం ఉదయం విలేఖరులను ఆహ్వానించారు. మరికాసేపట్లో సమావేశం మొదలవుతుందనగా, బిఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి, సారయ్య రంగంలోకి దిగారు. పార్టీలోనే ఉండాలంటూ ఆరూరికి నచ్చజెప్పేం దుకు ప్రయత్నించారు. ఆరూరి ససేమిరా అనడంతో ఆయనను తమతోపాటు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ఆరూరి అనుచరులు వారి కారుకు అడ్డంపడ్డారు. కొంతసేపు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువైపులా పోటాపోటీ నినాదాలు కొనసాగాయి. చివరకు ఆరూరితో సహా ఎర్రబెల్లి, సారయ్య సంఘటన స్థలంనుంచి నిష్క్రమించారు. ఆరూరిని జనగామలో ఉన్న హరీశ్ రావు వద్దకు తీసుకువెళ్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఆరూరిని బుజ్జగించి పార్టీలోనే కొనసాగించే బాధ్యతను హరీశ్ రావు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జనగామ జిల్లా పెంబర్తి దగ్గర ఉద్రిక్తత నెలకొంది. ఆరూరి రమేష్ ను ఎర్రబెల్లి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా వాహనాన్ని బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. కారులోంచి ఆరూరిని లాగేందుకు ప్రయత్నించారు. దీంతో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఆరూరి రమేష్ చొక్కా చినిగిపోయింది. ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డితో ఆరూరి రమేశ్ ఫోన్లో మాట్లాడారు. తనను ఎవరూ బలవంతంగా తీసుకెళ్లడు లేదని.. వ్యక్తిగత పనిమీద వెళుతున్న మాట్లాడి వస్తానని కిషన్ రెడ్డికి రమేశ్ సమాధానం ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి ఎర్రబెల్లి దయాకర్ వాహనం ఎక్కి రమేష్ వెళ్లిపోయారు. మంగళవారం హైదరాబాద్ లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసిన ఆరూరి..ఇవాళ పార్టీకీ రాజీనామా చేసేందుకు సిద్ధమై ప్రెస్ మీట్ పెట్టారు. ఈలోపు అక్కడికి చేరుకున్న ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి పార్టీలోని ఉండాలని నచ్చజెప్పేందుకు ప్రయత్నించడంతో డ్రామాకు తెరతీసారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఆరూరికి ఫోన్ చేసి పార్టీలోనే ఉండాలని కోరారు. మరోవైపు అక్కడ ఉన్న బీఆర్ఎస్, బీజేపీ నేతలు పోటాపోటీగా నినాదాలు చేశారు. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి వర్ధన్నపేట ఎమ్మెల్యే గా గెలిచిన ఆరూరి రమేశ్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు చేతిలో ఓడిపోయారు. ఉమ్మడి వరంగల్ రాజకీయాలను ప్రభావితం చేయగలిగిన ఎస్సీ నేతగా రమేశ్‌కు గుర్తింపు ఉంది. ప్రస్తుతం బీఆర్ఎస్ వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. ఓటమి తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ బలహీనపడుతుండటంతో పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు.

# దేశ ప్రాధాన్యాలు గుర్తించడంలో కాంగ్రెస్ విఫలం

కోసం భారత్ కలలు కన్నది. అప్పటినుంచి దేశాన్ని పాలించిన ప్రభుత్వాలు వాటి ప్రాధాన్యాన్ని గుర్తించలేకపోయాయి. భవిష్యత్తు అవసరాలకు తగినట్లు పెట్టుబడులు పెట్టలేకపోవడంతో ఈ రంగంలో భారత్ చాలా వెనకబడింది. కానీ, మా ప్రభుత్వం అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా సెమీకండక్టర్ల తయారీకి సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు మాత్రమే వీటిని తయారుచేస్తున్నాయి. 21వ శతాబ్దం సాంకేతికత ఆధారంగా పనిచేస్తుంది. ఎలక్ట్రానిక్ చిప్ లేని గ్యా÷-జడెట్స్‌ను ఊహించడం కష్టం. మేడిన్ ఇన్ ఇండియా, డిజైన్ ఇన్ ఇండియా చిప్ ఎంతో దూరంలో లేదు. ఇతరులపై ఆధారపడకుండా భారత్ స్వయంసమృద్ధిగా ఎదగడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని ప్రధాని తెలిపారు. భాజపా అధికారంలోకి వచ్చాక.. రక్షణ, బీమా, టెలికాం రంగంలో ఎఫ్‌డీఐలను ఆకర్షించేందుకు సరళతరమైన విధివిధానాలు రూపొందించినట్లు ప్రధాని తెలిపారు. ప్రస్తుతం మొబైల్ తయారీలో భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా నిలిచేందుకు ఇవి ఎంతో దోహదం చేశాయన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమల ద్వారా దేశ యువత అధికంగా లబ్ధి పొందుతారని తెలిపారు. ఏఐ మిషన్‌లో భాగంగా సరికొత్త ఆవిష్కరణల కోసం భారత్ పనిచేస్తోందని, సాంకేతిక అభివృద్ధితోపాటు దాన్ని అమలుచేయడంపైనా కేంద్రం దృష్టి సారించిందన్నారు. 2029 కల్లా ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్లు తయారుచేస్తున్న తొలి ఐదు దేశాల్లో భారత్ ఉంటుందని కేంద్ర టెలికాం, ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. గుజరాత్‌లోని ధోలేరాలో జరిగిన సెమీకండక్టర్ ఎ÷-లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026 కల్లా తొలి దేశీయ చిప్ టాటా ఎలక్ట్రానిక్స్ ఎ÷-లాంట్ నుంచి ఉత్పత్తి అవుతుందని వెల్లడించారు. ఈ ప్లాంట్ ద్వారా 27 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు.

# సార్వత్రికానికి సర్వం సిద్ధం

ఎప్పటికప్పుడు స్పందించేందుకు గాను ప్రతీ జిల్లాలో ఒక సోషల్ మీడియా సెల్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. అభ్యర్థులందరికీ సరైన భద్రత సమకూర్చడంతోపాటు కేంద్ర బలగాలను దించుతామన్నారు. జమ్మూ కశ్మీర్‌లో ఆన్‌లైన్ నగదు బదిలీపైనా పర్యవేక్షణ ఉంటుందన్నారు. 'మార్చి 12 నాటికి ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల డేటా అందించాల్సి ఉంది. అది మాకు చేరింది. ప్రజలకు అన్ని వివరాలు వెల్లడిస్తాం. కమిషన్ అనేది పారదర్శకతకు ఎప్పుడూ అనుకూలమే. గడువులోగా దాన్ని బహిర్గతం చేస్తాం' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో లోక్‌సభ ఎన్నికల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి మార్చి 12న ఎస్‌బీఐ అందజేసింది. ఏప్రిల్ 1, 2019 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 15 వరకు మొత్తంగా 22,217 ఎన్నికల బాండ్లను జారీ చేశామని వెల్లడించింది. అందులో 22,030 బాండ్లను పలు రాజకీయ పార్టీలు ఎన్‌క్యాష్ చేసుకుని నిధులు తీసుకున్నాయని.. మిగతా 187 బాండ్లను నిబంధనల ప్రకారం రిడీమ్ చేసి ప్రధానమంత్రి జాతీయ సహాయనిధిలో నగదు జమ చేసినట్లు వెల్లడించింది.

## ఉక్రెయిన్‌కు మద్దతిస్తే అణుయుద్ధమే..

నాటో దేశాలు ఆయుధాలను అందిస్తున్నాయి. గత నెలలో ఉక్రెయిన్‌లో పాశ్చాత్య బలగాల మోహరింపు అంశాన్ని కొట్టిపారేయలేమని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ చేసిన వ్యాఖ్యలపై పుతిన్ పరోక్షంగా స్పందించారు. ఉక్రెయిన్‌లో తమ లక్ష్యాలను సాధించి తీరతామని, ఈ యుద్ధంలో అతిగా జోక్యం చేసుకోవడం వంటి చర్యలు.. ప్రపంచ అణు సంఘర్షణ ముప్పుతో నిండి ఉన్నాయని పశ్చిమదేశాలను ఆయన హెచ్చరించారు. తాజాగా మరోసారి ఇదే అంశంపై ఆయన స్పందించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో పుతిన్ విజయంపై ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఆసక్తిగా ఉన్నాయి.

## కాంగ్రెస్‌కు వరుస ఎదురుదెబ్బలు

## ఆదాయపుపన్న శాఖ నోటీసులపై జోక్యం చేసుకోలేం

## హైకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ,మార్చి13 (ప్రజా మంటలు):



లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఆదాయపు పన్ను వివాదంలో కాంగ్రెస్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఆదాయపు పన్ను శాఖ నోటీసులపై స్టే ఇచ్చేందుకు నిరాకరిస్తూ అప్పీలేట్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును హైకోర్టు కూడా సమర్థించింది. ఇందులో తాము జోక్యం చేసుకోలేమంటూ హస్తం పార్టీ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. 2018-19 మదింపు సంవత్సరానికి సంబంధించిన ఐటీ రిటర్నుల విషయంలో ఆదాయపు పన్ను విభాగం గతంలో కాంగ్రెస్‌కు పలుమార్లు నోటీసులు జారీ చేసింది. వీటికి పార్టీ నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో చర్యలు చేపట్టిన ఐటీ విభాగం.. పన్ను రికవరీ నిమిత్తం ఇటీవల పార్టీకి నోటీసులు జారీ చేసింది. ఆ మదింపు సంవత్సరానికి పార్టీ చెల్లించాల్సిన వాస్తవ పన్ను డిమాండ్ రూ.102 కోట్లు కాగా.. వడ్డీతో కలిపి అది రూ.135.6 కోట్లకు పెరిగింది. ఇందులో రూ.65.94 కోట్లను ఇటీవల ఐటీ అధికారులు రికవరీ చేసుకున్నారు.ఈక్రమంలోనే తమ అకౌంట్లపై ఐటీ విభాగం ఎలాంటి చర్యలు చేపట్టకుండా నోటీసులపై స్టే విధించాలంటూ కాంగ్రెస్ పార్టీ ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేసింది. ఇందుకు ట్రైబ్యునల్ నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించింది. తమ బ్యాంకు ఖాతాలను అధికారులు స్తంభింపజేశారని న్యాయస్థానానికి తెలిపింది. తమకు ఊరట కల్పించాలని, లేకుంటే పార్టీ కుప్పకూలుతుందని పేర్కొంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం కాంగ్రెస్ అభ్యర్థనను తోసిపుచ్చింది. 'రికవరీ నోటీసులు చట్టబద్ధంగానే ఉన్నాయి. ఇందులో మేం జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదు' అని కోర్టు స్పష్టం చేసింది. దీంతో పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది.

## జ్యాడిషియల్ విచారణతో కెసిఆర్ పరేషాన్

**ఏం మాట్లాడాలో తెలియడం లేదు**
**మూడు పిల్లర్లు కుంగితే డ్యామ్ ఉంటుందా**
**మిషన్ భగీరథ ఓ ఫెయిల్యూర్ స్టోరీ**
**కెసిఆర్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**



**హైదరాబాద్, మార్చి 13 (ప్రజా మంటలు):** కాళేశ్వరం, యాదాద్రి పవర్ ప్రాజెక్టుపై పవర్ కొనుగోలుపై జ్యూడిషరీ ఎంక్వయిరీ వేయడంతో కేసీఆర్ పరేషాన్లో పడ్డారని కాంగ్రెస్ ఎమెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. మూడు పిల్లర్లు దెబ్బతింటే అయిపోయిందా అని కేసీఆర్ అంటుండు అని.. గుండె పోయిన తర్వాత మనిషి బతుకుతాడా ? అని ప్రశ్నించారు. సభకు రాకుండా టీవీ ముందుకు వస్తా అంటుండు. నిన్ను ఎవరైనా అవుతున్నారా? బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏం మాట్లడుతుండో ఆయనకే తెలియాలని ఎమెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగు నీరు అందకపోవడానికి కేసీఆరే కారణమని అన్నారు. కరువుకు కేసీఆరే కారణమని విమర్శించారు. మిషన్ భగీరథ ఫెయిల్యూర్ ప్రాజెక్టని అన్నారు. కమిషన్ల కక్కుర్తితోనే మిషన్ భగీరథ ప్రాజెక్టు తీసుకొచ్చారని ఆరోపించారు. ఆ సలహా ఇచ్చిన అధికారిని ఉరి తీయాలని తాను సభలోనే చెప్పానన్నారు. పంటలు తడి ఆరకుండా చూడాలన్నారు. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ ప్రభుత్వమైన ఏర్పడిన 100 రోజుల్లో హామీలను అమలు చేసిన సందర్భం లేదు. బీఆర్ఎస్ 10 ఏళ్లల్లో చెయ్యలేనివి రేవంత్ రెడ్డి మూడు నెలల్లో చేసి చూపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీజేపీ కూడా కనుమరుగవుతుంది. భాష గురించి కేసీఆరే మాట్లాడాలి. బీఆర్ఎస్ నేతలకు ఇన్ని రోజులు కేసీఆర్ మాట్లాడితే వినసొంపుగా ఉంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడితే సీసం పోసినట్లు ఉందా? మా పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఢిల్లీ లో ఉంది. సమావేశాలకు వెల్లాల్సిన అవసరం మాకు ఉంటుంది. మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ ఎందుకు వస్తున్నారుని జీవన్ రెడ్డి నిలదీశారు.


## రెండు కారిడార్లలో ఢిల్లీ మెట్రో విస్తరణ
## కేంద్ర కేబినేట్ ఆమోదం

**న్యూఢిల్లీ,మార్చి 13 (ప్రజా మంటలు):** కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఢిల్లీ మెట్రో విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రెండు కొత్త మెట్రో కారిడార్లకు ఆమోదం తెలిపినట్టు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు.ఇందుకోసం కేంద్రం రూ. 8400 కోట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. లజ్‌పత్ నగర్ నుంచి సాకేత్ ఉ బ్లాక్ వరకూ మొత్తం 8.4 కిలోమీటర్ల మేర ఈ కారిడార్‌లను నిర్మించనున్నట్టు స్పష్టం చేశారు. ఈ కారిడార్‌లలో మొత్తం 8 స్టేషన్‌లుంటాయని వివరించారు. కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నాం. కొత్తగా రెండు మెట్రో కారిడార్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.8,400 కోట్లు కేటాయిస్తాం. లజ్‌పత్ నగర్ నుంచి సాకేత్ ఉ బ్లాక్ వరకూ 8.4 కిలోమీటర్ల మేర ఓ కారిడార్ నిర్మించనున్నాం. ఈ కారిడార్‌లో 8 స్టేషన్‌లుంటాయి. ఇక రెండో కారిడార్ ఇందర్‌లోక్ నుంచి ఇంద్రప్రస్థ వరకూ 12.4 కిలోమీటర్ల మేర మెట్రో లైన్ నిర్మాణం చేపట్టనున్నాం. 2029 మార్చి నాటికి ఈ కారిడార్ల నిర్మాణం పూర్తవుతుంది.

### బిఆర్ఎస్ అధ్యక్షపదవికి కోనప్ప రాజీనామా

**నేడు సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక**

**కాగజ్‌నగర్, మార్చి 13 (ప్రజా మంటలు):** లోక్ సభ ఎన్నికల వేళ బిఆర్ఎస్ కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. తాజాగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవికి ఆయన బుధవారం రాజీనామా చేశారు. తాను గురువారం మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ లో చేరుతున్నట్లు చెప్పారు. కోనప్ప ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి, కాంగ్రెస్ లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు.




## సంగంబండను త్వరలోనే పూర్తి చేస్తాం
## మంత్రులు ఉత్తమ్, భట్టిల ప్రకటన

**నారాయణపేట, మార్చి 13 (ప్రజా మంటలు):** మక్తల్ నుంచి వచ్చే అన్ని ప్రతిపాదనలను ఆమోదిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నారాయణ పేట జిల్లాలో మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పర్యటించారు. మక్తల్ మండలం సంగంబండ ప్రాజెక్టును మంత్రులు పరిశీలించారు. ప్రాజెక్టు లోలెవల్ కెనాల్ కాల్వ తవ్వకానికి అడ్డంకిపై ఆరా తీశారు. 400 మీటర్ల బండను మంత్రులు భట్టి, ఉత్తమ పరిశీలించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడారు. కనీవినీ ఎరుగని రీతిలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తామని, ఐదేళ్లలో పాలమూరు రంగారెడ్డి, భీమా, కోయల్‌సాగర్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ప్రజల కోసం కాదు అని పైసల కోసమే ప్రాజెక్టులు కట్టారని ధ్వజమెత్తారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇండ్లు కట్టిస్తామని, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఉత్తమ్ పేర్కొన్నారు. వంశీచంద్ రెడ్డి ఎంపి అయితే పాలమూరు మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. పాలమూరు ప్రజల జీవితాల్లో వంశీచంద్‌రెడ్డి వెలుగులు నింపుతారని తెలిపారు. సంగంబండ శివాలయం, అంజనేయ స్వామి ఆలయంలో మంత్రులు ప్రత్యేక పూజలు చేశారు.

## నర్సంపేటలో బిఆర్ఎస్ నేతకు చేదు అనుభవం

**పార్టీ మారాలనుకున్నందుకు మహిళ చెప్పదెబ్బలు**

**వరంగల్, మార్చి 13 (ప్రజా మంటలు):** పార్టీ మారాలని చూసిన నాయకుడికి ఊహించని చేదు అనుభవం ఎదురైంది. పార్టీ మారాలనుకున్న నాయకుడిని ఓ మహిళ చెప్పుతో కొట్టిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలో చోటు చేసుకుంది. బీఆర్ఎస్ కు చెందిన ఖంఅ=ూ ఛైర్మన్ మోహన్ రెడ్డిని రెండు నెలల క్రితం పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అయితే ఈ నేపథ్యంలో మోహన్ రెడ్డి కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసి కాంగ్రెస్ నాయకురాలు మంజుల చెప్పుతో కొట్టింది. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వీరిమధ్య వ్యక్తగత విభేధాలు ఉండటంతో.. మోహన్ రెడ్డి కాంగ్రెస్ లోకి రావద్దని మహిళా నాయకురాలు ఇలా చేసిందిదని తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ వలసలతో.. ఎప్పుడు ఎలాంటి పరిణామాలు జరుగుతాయో ఎవ్వరూ ఊహించలేకపోతున్నారు.

# హుస్నాబాద్‌లో తాగునీటి కోసం రూ.5 కోట్లు

**గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తాం**
**హుస్నాబాద్ పర్యటనలో మంత్రి పొన్నం వెల్లడి**

**సిద్దిపేట, మార్చ్ 13 (ప్రజామంటలు):** హుస్నాబాద్‌లో తాగునీటి కోసం రూ.5 కోట్లు కేటాయించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించాలనేది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. 90 రోజుల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్తున్న ప్రభుత్వం తమది అని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులను అడిగి వారి సమస్యలను పొన్నం అడిగి తెలుసుకోవడం జరిగింది. తమకు కాంపౌండ్ వాల్ తో పాటు, త్రాగునీరు, వీధి దీపాలు సమస్యలను ఉన్నాయని మంత్రి దృష్టికి విద్యార్థులు తీసుకొచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పక్కనే ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భవనం పూర్తయినప్పటికీ కాలేజీ ఎందుకు అందులోకి షిఫ్ట్ చేయలేదని అడిగారు. రేపే కాలేజీని డిగ్రీ కాలేజీ నూతన భవనం లోకి షిఫ్ట్ చేయాలని అధికారులకు, ప్రిన్సిపల్ కి ఆదేశాలు జారీ చేశారు. నూతన భవనంలో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అనివేటి మండపం శంఖుస్థాపన చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆలయ ప్రాంగణంలో అనివేటి మండపం శంఖుస్థాపన శిలన్యాస భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని మంత్రి సందర్శించారు. విద్యార్థినులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంపౌండ్ వాల్‌తో పాటు, వాటర్ ఫెసిలిటీ, స్ట్రీట్ లైట్స్ సమస్యలను మంత్రి దృష్టికి విద్యార్థినులు తీసుకెళ్లారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని మంత్రి పొన్నం ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పక్కనే ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భవనం పూర్తయినప్పటికీ కాలేజీ ఎందుకు అందులోకి షిఫ్ట్ చేయలేదని ప్రశ్నించారు. అంతే కాకుండా రేపే కాలేజీని డిగ్రీ కాలేజీ నూతన భవనంలోకి షిఫ్ట్ చేయాలని అధికారులకు, ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. నూతన భవనంలో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుదీప్ చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## చీరకొంగు చక్రంలో చుట్టుకొని బైక్ పై నుంచి పడి మహిళ మృతి

**వేలేరు మార్చ్ 13 (ప్రజామంటలు):**




వేలేర్ మండలం ఎస్సై హరిత తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గొల్ల కృష్ణం పల్లె గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బైక్ పై ఎక్కిచ్చి వేలేరు గ్రామం శివారు నుంచి గొల్ల కృష్ణం పల్లె తీసుకు వెళుతుండగా చక్రం లో చీర కొంగు చుట్టుకొని బైక్ పై నుంచి కిందపడి బండారి చంద్రబాగ మృతి చెందిందని పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎం కి తరలించామని, బైకు నడుపుతున్న వ్యక్తిపై దరఖాస్తు ఇస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తాం అని ఎస్సై హరిత తెలిపారు.

## అనుమతి లేకుండా తరలిస్తున్న 39 ఆవులు

**పట్టుకున్న ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్**



**ఇబ్రహీంపట్నం మార్చ్ 13 (ప్రజామంటలు):** బండ లింగాపూర్ గ్రామ శివారులో గల గండి హనుమాన్ చెక్ పోస్ట్ వద్ద ఉదయం సమయంలో ఇబ్రహీంపట్నం మండల ఎస్సై అనిల్ తన సిబ్బందితో యుక్తముగా వాహనాల తనిఖీ చేయుచుండగా, ఒక డీసీఎం బి. ఎన్ ఓ. టి ఎస్- 20 -టి - 6283 గల వ్యాను జగిత్యాల నుండి నిజామాబాద్ వెళుతుండగా అట్టి వాహనమును ఆపి తనిఖీ చేయగా అందులో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న సుమారు 39 ఆవులను పట్టుకోవడం జరిగింది. వెంటనే వీటిని జగిత్యాల జిల్లా తాటి పెల్లి గ్రామంలో గల సురభి గోషాలకు సంరక్షణ నిమిత్తం పంపించి ఈ ఆవులను తరలిస్తున్న యజమాని షేక్ సల్మాన్ %ం/శీ% షేక్ మహబూబ్ 32 సంవత్సరాలు కులం ముస్లిం %తీ/శీ% గడ్చందూర్ గ్రామం. కొర్పాన్ మండలం. చంద్రాపూర్ జిల్లా. స్టేట్ మహారాష్ట్ర. మరియు వ్యాన్ డ్రైవర్ పఠాన్ సమీర్ ఖాన్ %ం/శీ% మెహమూద్ ఖాన్, 25 సంవత్సరాలు, కులం ముస్లిం, గ్రామం మరియు మండలం ఆసిఫాబాద్ జిల్లా, అనువారి పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి దర్యాప్తు ప్రారంభించనైనది అని ఎస్ఐ అనిల్ తెలిపారు. సీఐ కూడా ఉన్నారు.



# నిజామాబాద్‌లో పోటీకి ఎమ్మెల్సీ కవిత దూరం?

**ఇటు ఛాయలకు కూడా రాని కెసిఆర్ తనయ**
**అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసినా దక్కని ఫలితం**
**నిజామాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థిపై తేలని వ్యవహారం**

**నిజామాబాద్,మార్చి13 (ప్రజా మంటలు):** పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్, బిజెపిలు పోటాపోటీగా అభ్యర్థులను ప్రకటించారు. బిఆర్ఎస్ మాత్రం మెల్లగా ప్రకటిస్తోంది. ఈ రెండు పార్టీలకు అధిష్టానం ఢిల్లీలో ఉండడంతో కాస్తా ఆలస్యం అవుతోంది. కానీ కెసిఆర్ తన అబ్యర్థులను ప్రకటించడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. అసెంబ్లీకి మాత్రం ఏకంగా అభ్యర్థులను ప్రకటించిన జోరు..పార్లమెంట్ ఎన్నికల్లో కానరావడం లేదు. ఆచితూచి ప్రకటిస్తున్నారు. కొందరైతే వద్దు మొర్రో అంటున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ కవిత పోటీ చేయదనే సంకేతాలు వెలువడుతున్నాయి.ఆమె స్థానంలో ఎవరు నిలబడతారన్నది కూడా సమాధానం లేదు. నిజామబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి ఎవరన్నది సస్పెన్స్‌గానే ఉంది. మొత్తంగా కెసిఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత పార్లమెంటు ఎన్నికల బరిలో ఉండటం లేదని స్పష్టమయింది. నిజామాబాద్ నుంచి 2014లో గెలిచిన కవిత.. 2019లో ఓడిపోయారు. ఈసారి అక్కడే పోటీ చేసేందుకు గతంలో సన్నాహాలు చేశారు. కానీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఒక్కసారిగా వెనుకడుగు వేశారని అర్థం అవుతోంది. ఇప్పుడు పోటీచేస్తే ఓటమి ఖాయమని ఆమె భావిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపిల నుంచి పోటీ తట్టుకోవడం కష్టమనే వాదనలు ఉన్నాయి. అందుకే ఆమె ఎక్కడా పోటీ గురించి మాట్లాడటం లేదు. అంతే కాదు నిజామాబాద్ బీఆర్ఎస్ వ్యవహారాలు కూడా చూసుకోవడంలేదు. పూర్తిగా తన తెలంగాణ జాగృతి సంస్థ బలోపేతంపైనే దృష్టి పెట్టారు. తాను చేసే కార్యక్రమాలు పూర్తిగా జాగృతి పేరు మీదనే నిర్వహిస్తున్నారు. లోక్‌సభ సన్నాహాక సమావేశాల్లో కూడా కవిత ఎక్కడా కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడితో కాలక్షేపం చేస్తున్నారు. అందుకే లోక్ సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ అధినేత నిర్వహించిన కీలక సమావేశాల్లో సైతం ఆమె కనిపించలేదు. కవిత పార్లమెంటు ఎన్నికల్లో నిలబడాలంటే ఆమె సొంత నియోజకవర్గంగా చెప్పుకునే నిజామాబాద్ నుండే బరిలో దిగుతారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ఆమె ఉమ్మడి నిజామాబాద్ లోనే ఎక్కువగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కానీ అక్కడ 9 అసెంబ్లీ సెగ్మెంట్లకు గానూ కేవలం రెండు స్థానాల్లో మాత్రమే బీఆర్ఎస్ గెలిచింది. 2018 ఎన్నికల్లో 8 స్థానాల్లో గెలవగా, యల్లారెడ్డిలో కాంగ్రెస్ గెలిచింది. అనంతరం ఆ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా గులాబీ గూటికి చేరారు. కానీ ఈసారి కేవలం రెండు స్థానాలకే బీఆర్ఎస్ పరిమితం అయింది. 2018 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవని బీజేపీ 3 సీట్లు, కాంగ్రెస్ 4 సీట్లు గెలుచుకుంది. అంతేకాదు కామారెడ్డిలో సీఎం అభ్యర్థులు కేసీఆర్, రేవంత్ రెడ్డిలు సైతం బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. నిజామాబాద్ కి పసుపు బోర్డు కేటాయించడంతో స్థానిక ఓటర్లలో బీజేపీపై విశ్వాసం పెరిగిందన్న అభిప్రాయం ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి ఆ ప్రభావం పార్లమెంటు ఎన్నికల్లోనూ ఉంటుంది. దీంతో ఉమ్మడి నిజామాబాద్ వ్యాప్తంగా పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉండే ఛాన్స్ ఉంది. ఈ సమీకరణాలన్నీ అంచనా వేసుకున్న తర్వాత పోటీకి దూరంగా ఉన్నారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలనే ఆలోచనతో కేసీఆర్ టీఆర్ఎస్ ని బీఆర్ఎస్ గా మార్చారు. ఆ సమయంలో కేసీఆర్‌కు జాతీయ రాజకీయాల్లో కవితే కీలకంగా వ్యవహరించారు. జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ కు ప్రచారం వచ్చేలా చేయడం లో కవితే కీలకంగా వ్యవహరించారు. తెలంగాణ జాగృతిని భారత జాగృతిగా మార్చారు. మరోవైపు కవిత బీఆర్ఎస్ తరపున కాకుండా..



తెలంగాణ జాగృతి తరపున రాజకీయ కార్యక్రమాలు చేపడుతున్నారు. మహిళల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్న జిఓ 3ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. తాజాగా అసెంబ్లీలో పూలే విగ్రహం కోసం బీసీ సంఘాలతో కూడా జాగృతి తరపునే సమావేశం నిర్వహించారు. లోక్ సభ ఎన్నికలు వస్తున్నందున అక్కడ నిలబడ బోయే అభ్యర్థి కోసం కూడా కసరత్తు చేయడం లేదు. దీంతో రాజకీయం విషయంలో కవిత తన సొంత బాటను ఎంచుకుంటున్నారన్న వాదన వినిపిస్తోంది. తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు స్వరాష్ట్రంలో ఓటమి చవిచూడటంతో కారు పార్టీ డీలా పడింది. ఈ క్రమంలో జాతీయ రాజకీయాల సంగతి పక్కన పెట్టినట్టే కనిపిస్తోంది. తెలంగాణలో అనుకూల ఫలితం వచ్చి ఉంటే కవిత ఎంపీగా పోటీ చేసేవారు. కేసీఆర్ నేషనల్ పాలిటిక్స్‌లో బిజీగా ఉండేవారు.. కవిత కూడా రాష్ట్ర రాజకీయాల్లో కనిపించేవారు. తాజా పరిణామాల్లో ఇప్పుడు మెదక్ నుంచి పోటీ చేయించడానికి కూడా కేసీఆర్ సిద్ధంగా లేరని అంటున్నారు. ఓటమి భయంతో కేసీఆర్ కూతుర్ని నిజామాబాద్‌లో పోటీ చేయించడం లేదని, దమ్ముంటే పోటీ చేయించాలని రేవంత్ రెడ్డి భద్రాచలంలో సవాల్ విసిరారు. బీఆర్ఎస్ – బీజేపీ మధ్య లోపాయికారిక ఒప్పందం ఉందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. లిక్కర్ స్కామ్ లో కవితని అరెస్ట్ చేయకపోవడానికి కూడా కారణం అదేనంటూ బలంగా వాదిస్తున్నాయి. ఇక అందులో భాగంగానే నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కి మేలు చేకూర్చడానికి కవితని పోటీలో ఉంచడం లేదని అంటున్నారు. ఓ డమ్మీ క్యాండిడేట్ ని నిలబెట్టి, బీజేపీకి రహస్య మద్దతు ఇస్తారనే టాక్ నడుస్తోంని, దీన్ని రేవంత్ రెడ్డి హైలెట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం



**సికింద్రాబాద్ మార్చి 13 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సికింద్రాబాద్ లో ముదిరాజ్ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి లకు వారు అభినందనలు తెలిపారు. పదేండ్ల కాలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు కూడ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన ముదిరాజ్ లను పట్టించుకోలేదన్నారు. కాని అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ముదిరాజ్ ల సంక్షేమం గురించి ఆలోచించి, తగిన నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ సర్కార్ ను అఖిల భారత ముదిరాజ్ సంఘ అద్యక్షులు పొట్లకాయల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీనివాస్ రాజ్ లు అభినందించారు.

## హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు
## 1000 రూపాయల జరిమాన

**జగిత్యాల మార్చ్ 13 (ప్రజామంటలు):** జగిత్యాల కు చెందిన డొక్కా రాజారామ్ అనే వ్యక్తి భార్య పిల్లలతో కలిసి జగిత్యాల పట్టణంలో నివసిస్తూ ప్లాస్టిక్ సామాన్లు పోగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 2022 అక్టోబర్ 18న రాజారామ్ జగిత్యాల పట్టణంలోని చిన్న కెనాల్ వద్ద మస్తాన్, తుపాకి రాముడు అనే వ్యక్తులతో కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో రాజారామ్ జేబులో నుండి మస్తాన్ 500 నోట్లు తీసుకున్నాడు. ఈ విషయమై రాజారం కు, మస్తాన్ కు గొడవ జరగడం జరిగింది. ఇదే గొడవ మనసులో పెట్టుకొని రాజారాం ను చంపేస్తానని మస్తాన్ అందరి ముందు హెచ్చరించి వెళ్లడం జరిగింది. 2022 అక్టోబర్ 19 రోజున చిన్న కేనాల వద్ద ఉన్న చెట్టు కింద రాజారామ్ పడుకొని ఉన్న విషయాన్ని గమనించిన మస్తాన్ బండ రాయి తో రాజారామ్ తలపై బాధి హత్య చేశాడు. మృతుని భార్య అయిన డొక్కా గంగమణి ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగినది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిదితుడు అయన మస్తాన్ ను కోర్టులో హాజరు పరచడం జరిగింది. కేస్ ను విచారించిన న్యాయమూర్తి సుగాలి నారాయణ అడిషనల్ సెషన్ జడ్జి గారు నిదితునికి జీవిత ఖైదు పాటు 1000 /- రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేస్ లో పీపీ గా మల్లేశం , ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ గా కిషోర్ ఇన్స్పెక్టర్, సిఎంఎస్ ఎస్ఐ జి. రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్ కుమార్, కోర్ట్ కానిస్టేబుల్ శ్రీనివాస్ నిందితునికి శిక్ష పడడంలో గౌరవ కోర్టుకు సాక్షాధారాలు అందించడంలో ప్రముఖ పాత్ర వహించడం జరిగింది. పై కేస్ లో నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

## ఆర్యవైశ్య సంఘ భవనంలో సీఎం చిత్రపటానికి ఎల్లంకి రమేష్ ఆధ్వర్యంలో పాలాభిషేకం

**గొల్లపల్లి మార్చ్ 13 (ప్రజామంటలు):**



గొల్లపల్లి మండల కేంద్రంలో ఎల్లంకి రమేష్ ఆధ్వర్యంలో ఆర్యవేశ కార్పొరేషన్ కోసం గతంలో రిలే దీక్ష చెప్పటిన ఎల్లంకి రమేష్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారు. వారిని శాలువాతో సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో అనంతల భూమయ్య, ఎర్ర సంపత్, పాలకుర్తి శంకరయ్య, చాడ వెంకటరమణ, బొల్లం రమేష్, రంగ రవీందర్, పాత సంతోష్, ఎర్ర శ్రీనివాస్, ఎర్ర మల్లేశం, చిట్టిమల సతీష్, ప్రసాదు, వెలిశాల బుచ్చయ్య, పెంటయ్య, మల్లేశం, రాజశేఖర్ పాల్గొన్నారు.

**కరీంనగర్ జిల్లా జమ్మికుంట తాహసిల్దార్ రజిని ఇంట్లో ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఫిర్యాదులపై ఏసీబీ సోదాలు.**



**హనుమకొండ కేఎస్ఎవ్ రెడ్డి కాలనీ లో తాహసిల్దార్ రజని ఇంట్లో, వివిధ ప్రాంతాలలోని ఆమె బంధువుల ఇళ్లల్లోనూ సోదాలు చేస్తున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు**

# మార్మోగుతున్న మోడీ గ్యారెంటీలు !



పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రధాని మోడీ సుడిగాలి పర్యటనలు చేపట్టారు. మోడీ గ్యారెంటీ అంటూ లక్షల కోట్ల పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఎన్నికల కోసం కాదు..అభివృద్ధి కోసం అంటూ ప్రజలను నమ్మిస్తున్నారు. పత్రికలు, టీవీల్లో వ్యాపార ప్రకటనలు కోకొల్లలుగా వస్తున్నాయి. గతంలో 2004లో భారత్ వెలిగిపోతోందన్న తరహాలో..ఇప్పుడు మోడీ గ్యారెంటీ మార్మోగుతోంది. నిజానికి పార్లమెంటులో ఏ ఒక్క సమస్యపైనా మాట్లాడని మోడీ పార్లమెంట్ వెలుపల మాత్రం మోత మోగిస్తున్నారు. కొత్తగా కట్టిన పార్లమెంట్ కేవలం చూడ్డానికే అన్నట్లుగా మొన్నటి శీతాకా, బడ్జెట్ సమావేశాలు ముగిసాయి. ఇప్పుడేమో మోడీ, అమిత్ షాలు ఇద్దరూ భారతదేశ దశ మొత్తం మారిందని, గత పదేళ్లలో మార్చేశామన్న రీతిలో సాగుతున్నారు. మంత్రులు ఎవరు కూడా దేశంలో ఎక్కడా ఒక్క ప్రారంభోత్సవం చేయడం లేదు. చివరకు వందేభారత్ రైలుకు కూడా మోడీ జెండా ఊపాల్సిందే. హైదరాబాద్ వచ్చిన అమిత్ షా కెసిఆర్, బిఆర్ఎస్ అక్రమాలు, అవినీతి గురించి మాట్లాడారు. పదేళ్లలో ఒక్కటంటే ఒక్క చర్య తీసుకోలేదు. అలా తీసుకోలేనందుకు కారణాలు చెప్పకుండా అవినీతి గురించి మాట్లాడారు. కొత్తగా వచ్చిన రేవంత్ సర్కార్‌కు సవాళ్లు విసిరారు. ఊకదంపుడు ఉపన్యాసాలు, ఆరోపణల్లో బిజెపి ఆరితేరింది. అయోధ్య రామాలయ నిర్మాణం, 370 ఆర్టికల్, ట్రిపుల్ తల్లాక్ వంటివి చూపి దేశాన్ని అద్భుతం చేశామని ప్రచారం చేసుకుం టున్నారు. అవినీతి లేదని చెప్పుకుంటున్న నేతలు కర్నాటకలో బిజెపి పాలనలో జరిగిన అవినీతి గురించి చర్యలు తీసుకోలేదు. ఎపిలో జగన్ అవినీతిపై చర్యలు లేవు. కెసిఆర్ అవినీతిపైనా చర్యలు లేవు. కేవలం కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ల అవినీతి మాత్రమే వారికి కనిపిస్తోంది. నిజానికి జిఎస్టీ వల్ల ఎంతగా భారం పడుతుందో చర్చించరు. నిరుద్యోగం, ఉపాధి లేమి, ధరల పెరుగుదల గురించి మాట్లాడరు. ఇవన్నీ చెప్పకుండా అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తల్లాక్ చెప్పి తప్పించుకుంటున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందంటూ కాంగ్రెస్ గురించి ఆరోపణలు చేస్తారు. వారసత్వ రాజకీయాలతో కాంగ్రెస్‌పై దాడి చేస్తారు. దక్షిణాదిలో పాగా వేయాలనకున్న నేతలకు కనీసం పోటీ చేసే నాయకులను కూడా తయారు చేసుకోలేక పోయారు. ఇతర పార్టీల నుంచి వస్తే తప్ప పోటీకి అభ్యర్థులు లేరు. గత ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారంతా బయటకు వెళుతున్నా చేవ చచ్చినట్లుగా మిన్నకున్నారు. తాము చెబుతున్న మాటలు, నీతులు ప్రజలు ఎలా స్పందిస్తారన్న ఆలోచన కూడా వారిలో కానరావడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాగా వేస్తామని మాత్రం ప్రకటించు కుంటున్నారు. ఎపిలో పొత్తులు లేకుంటే దిక్కులేదు. ఒక్క అసెంబ్లీ కూడా ఒంటరిగా సాధించలేని దుస్థితిలో బిజెపి ఉంది. టిడిపి, జనసేనలతో పొత్తు కారణంగా బిజెపికి ఒకటి రెండయినా సీట్లు దక్కగలవు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరిలో 8 స్థానాలను సాధించి బలం పెంచుకున్న బీజేపీ.. పార్లమెంటు ఎన్నికల్లోనూ సత్తా చాటాలని భావిస్తోంది. ఎంపీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకుని మరింత బలపడాలని వ్యూహం రచిస్తోంది. ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించడం ద్వారా తమ ఓటు బ్యాంకును మరింత పెంచుకుని రాష్ట్రంలో బీఆర్ఎస్ను వెనక్కి నెట్టేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకే మరోమారు బిఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతిపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఇటీవల అమిత్ షా పర్యటనలో జరిగిన సభలో చేసిన విమర్శలే ఇందుకు నిదర్శనంగా చూడాలి. అందులో భాగంగానే ఎంపీ అభ్యర్థుల విషయం లో కాషాయ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కమల దళంలోకి వలస వచ్చే నేతలకు అగ్ర తాంబూలం ఇస్తోంది. వారినే అభ్యర్థులుగా ప్రకటించుకుంటోంది. జహీరాబాద్‌లో బిబి పాటిల్, నాగర్ కర్నూలులో ఎంపి రాములు తనయుడికి టిక్కెట్లు ఇచ్చారు. ఇప్పుడు మహబూబాబాద్ లో సీతారామ్ నాయక్‌కు సీటు ఇవ్వబోతున్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే కాషాయ పార్టీలో వలస నేతలకు టికెట్లు కేటాయించడంపై అసంతృప్తి జ్వాలలు భగ్గుమంటున్నాయి. మల్కాజ్‌గిరి నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ మురళీధర్‌రావు తన భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని ఇటీవల ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. పార్టీలో సభ్యత్వం లేని వ్యక్తికి హైదరాబాద్ టికెట్ ఇవ్వడమేంటని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. నిజామాబాద్ టికెట్ దక్కిన ధర్మపురి అర్వింద్‌పై స్థానిక నేతలు ఢిల్లీలో మీడియా సమావేశం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇలా ఎన్నడూ లేనివిధంగా పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా అసంతృప్త జ్వాలలు చెలరేగడం కమల దళంలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రెండో జాబితా ప్రకటించిన తర్వాత పార్టీలో అసమ్మతి సెగలు మరింత ఎక్కువగా ఉంటాయనే చర్చ జరుగుతోంది. అయితే సొంతంగా బలం ఉన్న నేతలు లేకపోవడంతో ..రాష్ట్రంలో పాగా వేసేందుకు వలసతపై ఆధారపడుతోంది. లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో వారే స్వయంగా ఇతర పార్టీల నేతల దగ్గరికి వెళ్లి మంతనాలు జరుపుతున్నారు. పార్టీలో చేరితే టికెట్ పక్కా అంటూ హామీ ఇస్తున్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తులో లేదని వివరిస్తూ.. తామే ప్రధాన ప్రత్యర్థి అని నమ్మకం కలిగిస్తూ నేతల చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాలో రాష్ట్రంలోని తొమ్మిది సీట్లకు పోటీ చేయబోయే వారి పేర్లను ప్రకటించింది. అందులో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు భరత్‌కు పార్టీలో చేరిన వెంటనే టికెట్లను ఖరారు చేసింది. దీంతో ఆయా స్థానాలపై ఆశలు పెట్టుకుని పార్టీని నమ్ముకున్న వారు ఆగ్రహంగా ఉన్నారు. బీజేపీ నేడో రేపో విడుదల చేసే రెండో జాబితాలో రాష్ట్రంలోని మిగిలిన సీట్లకూ అభ్యర్థులను ప్రకటించ నుంది. మొత్తం 17 స్థానాల్లో మిగిలిన మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ, పెద్దపల్లి, మెదక్ సీట్లకు అభ్యర్థులను ప్రకటిస్తారు. ఈ సీట్లలో అభ్యర్థిత్వం గురించి వినిపించే పేర్లలో ఏ ఒక్కరూ కూడా ఏళ్లకుఏళ్లుగా పార్టీని నమ్ముకుని ఉన్నవారు లేకపోవడం గమనార్హం. మహబూబా బాద్ నుంచి సీతారాం నాయక్, ఖమ్మం నుంచి జలగం వెంకట్రావు, ఆదిలాబాద్ నుంచి నగేశ్, నల్లగొండ నుంచి శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థిత్వాలు ఖరారైనట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నలుగురూ ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కమలం పార్టీలో చేరారు. వరంగల్ టికెట్ బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, పెద్దపల్లి టికెట్‌ను బీఆర్ఎస్‌తో అత్యంత సన్నిహితంగా ఉంటున్న మిట్టపల్లి సురేందర్‌కు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. మెదక్ సీటుకు రఘునందన్‌రావు.. మహబూబ్‌నగర్ స్థానం కోసం డీకే అరుణ, జితేందర్‌రెడ్డి పోటీపడుతుండగా.. వీరెవరూ బీజేపీలో కింది స్థాయి నుంచి పనిచేసుకుంటూ వచ్చిన వారు కాదు. ఇలాంటి పరిస్థితితో బిజెపి బ్రహ్మాండంగా దేశాన్ని అభివృద్ధి చేసిందని అంటే ఎవరు మాత్రం నమ్మగలరు. నిజంగానే అభివృద్ధి చేసివుంటే ..పార్టీ ఎంతగా ప్రజల్లోకి దూసుకోపోవాలి.

# రాజీవ్ స్వగృహాకు దక్కని మోక్షం

**ఖాళీ ఇళ్ల కోసం లబ్దిదారుల ఎదురుచూపు**

**తమకు ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతల వినతి**




ఖమ్మం,మార్చి18 (ప్రజామంటలు): నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను తమకు కేటాయించాలని పలు ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. అలాగే జర్నలిస్ట్ సంఘాలుకూడా ఆసక్తిగా ఉన్నాయి. గతంలో ఇళ్లను కేటాయిస్తామని చెప్పినా అది ఫలించలేదు. దశాబ్దకాలం తర్వాత రాజీవ్ స్వగృహ ప్లాట్లకు కదలిక వచ్చినా ఖమ్మం రాజీవ్ స్వగృహకు మాత్రం మోక్షం లభించలేదు. దీంతో కోట్లాది రూపాయలు భవన సముదాయాలు నిరుపయోగంగా ఉండడంతోపాటు చెత్తా చెదారంతో అసంపూర్తిగా శిథిలమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే నిర్మాణం పూర్తిచేసుకున్న పలు రాజీవ్ స్వగృహ సముదాయాలను ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులకు విడివిడిగా ప్లాట్ల వారీగా విక్రయించేందుకు బహిరంగ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10వేల రాజీవ్ స్వగృహ ప్లాట్లను విక్రయించాలని నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం భావించింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న ఇళ్లను పేదలకు అప్పగించాలన్న డిమాండ్ ఉంది. కట్టిన ఇళ్లు, ఖాళీస్థలాలను కూడా వేలంలో అమ్మి సొమ్ములు చేసుకోవాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వం యోచించింది. ఖమ్మం రాజీవ్ స్వగృహ ప్లాట్లు వేలం పెడితే పలువురు ఆసక్తి చూపుతున్నా... జిల్లా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ రాజీవ్‌స్వగృహ సమస్యను పట్టించుకోలేక పోయారు. ప్రభుత్వ సొమ్మే కదా మనకేంటి అన్న ధోరణితో వ్యవహరించారు. దీంతో ఖమ్మం రాజీవ్‌స్వగృహ ప్లాట్ల విషయం ఎటూ తేల్చలేక పోయారు. ఉద్యోగులు, అధికారులు, మధ్యతరగతి వర్గాలకు సైతం పక్కా ఇల్లు కల నెరవేర్చాలని దశాబ్దకాలం క్రితం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రాజీవ్ స్వగృహ పథకాన్ని ప్రవేశపెట్టింది. రూ.60కోట్లతో ఖమ్మం జిల్లా పోలేపల్లిలో భవనాలు నిర్మించింది.వివిధ ప్రాంతాల్లోని రాజీవ్ స్వగృహ ప్లాట్లను, ఖాళీస్థలాలను అమ్మేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయికమిటీని కూడా నియమించింది. అయితే ఈ వేలం వేసే జాబితాలో ఖమ్మంలోని రాజీవ్ స్వగృహ సముదాయం లేకపోవడంతో ఈ ప్లాట్లను అమ్ముతారా? లేక అలాగే ఉంచుతారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీటిని నిర్మించి పూర్తిచేసి ఇస్తే తీసుకుంటామని ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు తమ సంఘాల ద్వారా విన్నవించుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏజెన్సీ ఏరియాలో ఉండడంతో ఖమ్మంలోనే అందరికీ అపార్టుమెంట్లతోపాటు వ్యక్తిగత ఇళ్లు నిర్మించి ఇస్తామని దరఖాస్తులు తీసుకున్నారు. వేలసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయితే కొందరు మాత్రమే డిపాజిట్లు చెల్లించారు. రాజీవ్ స్వగృహ ధరలు అధికంగా ఉన్నాయని భావించి వాటిని తీసుకోవడానికి ఇష్ట పడలేదు. క్రమంగా ధరలు పెరగడంతో డబుల్‌బెడ్‌రూంధర ప్రైవేటుగా రూ.20నుంచి 30లక్షలు పలుకుతుంది. దీంతో రాజీవ్ స్వగృహ ఇళ్లపై అందరి దృష్టిపడింది. ఖమ్మంలో నిరుపయోగంగా ఉంటున్న రాజీవ్‌స్వగృహ అపార్టుమెంట్లు, స్థలం తమకు కేటాయిస్తే డబ్బులు చెల్లిస్తామని తెలంగాణ గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టు సంఘాలు కూడా ప్రభుత్వానికి విన్నవించాయి. అయితే ప్రభుత్వం ఈ విషయంలో ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదు.



# సమ్మర్‌లో హీట్ పెంచనున్న ఎండలు

**పంటచేలకు నీరు అందక ఆందోళన**

**నాటి కరెంట్ వైఫల్యాలను పక్కన పెట్టిన కెసిఆర్**

**అదేపనిగా విమర్శలు చేసి అభాసుపాలు**



హైదరాబాద్,మార్చి13 (ప్రజామంటలు): ఈ యేడు వేసవి ఎండలు విపరీతంగానే ఉంటాయని అంటున్నారు. వేసవి ఎండ, ఉక్కపోతతో జనం అల్లాడడం ఖాయమని తాజా ఎండలు చెబుతున్నాయి. ఏటా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం భారీగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రజలు వేసవి ఉపశమనం కోసం అనేక రకాల గృహోపకరాలను వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యం లో విద్యుత్ చార్జీల భారీగానే ఉండనుంది. తాజా అంచనాల ప్రకారం కనీసం 10శాతం ఛార్జీలు ఒక్కో ఇంటిపై పడనున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది. వ్యవసాయ రంగానికి 24గంటలు ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తున్నారు. ఒక్కో కుటుంబం ప్రస్తుతం సగటున ప్రతి ఇంటికి రూ.300ల నుంచి రూ.3వేల వరకు విద్యుత్ ఛార్జీలు చెల్లిస్తున్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను అందించడంతో విద్యుత్ శాఖపై భారం పడుతోంది. ఇది గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఉన్నదే. కానీ ఇవన్నీ మరచిపోయిన మాజీ సిఎం కెసిఆర్ కరీంనగర్ వేదికగా తన వైఫల్యాన్ని కప్పిపుచ్చి కాంగ్రెస్‌పై దాడి చేశారు. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుపైనా చిన్నతనంగా మాట్లాడారు. తనదంతా బ్రహ్మాండమైన పాలన అని, కాంగ్రెస్ దివాళా తీసిన పాలన అన్న చందంగా విమర్శలకు దిగారు. అయితే డిమాండ్ పెరగడంతో అనేక చోట్ల నీరు అందక పంటలు ఎండిన ఘటనలు నాడూ ఉన్నాయి. చిన్నపాటి మరమత్తులకే గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేయడం ఏమిటని ప్రశ్నించిన ఘటనలు అనేకం. వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెప్పుకొస్తున్నప్పటికీ జిల్లాల్లో మాత్రం విద్యుత్‌శాఖ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే వాదన అన్నదాతల నుంచి వినిపించింది. ఇది ఇప్పటికిప్పుడు వచ్చిన సమస్య కాదు. గత పదేళ్లలోనూ ఇదే సమస్య కొనసాగింది. విద్యుత్ కోతలను విధిస్తుండడంతో పంటలు ఎండు ముఖం పడుతున్నాయని కెసిఆర్ హయాంలో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. కానీ ఈ వార్తలను అణచివేశారు. తొక్కిపెట్టారు. ఇప్పుడేమో ఎక్కడ చిన్నవార్త జరిగినా బిఆర్ఎస్ బాకా మీడియా దానిని కొండంతలు చేసిచూపుతోంది. వ్యవసాయరంగానికే కాకుండా గృహ అవసరాలకు సైతం నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని నాటి బిఆర్ఎస్ అధికార పార్టీ ప్రతినిధులు,గొప్పలు చెప్పుకు న్నప్పటికీ జిల్లా విద్యుత్‌శాఖ మాత్రం ఆ స్థాయి విద్యుత్‌ను సరఫరా చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎన్నోసార్లు కాంగ్రెస్ నేతలు సబ్‌స్టేషన్లకు వెళ్లి ధర్నాలు చేశారు. కానీ కెసిఆర్ కరీంనగర్‌లో తన పాలన కాలం నాటి వైఫల్యాలను మరచిపోయి విమర్శలు చేసి రాజకీయ చేశారు. జిల్లాలలో విచ్చలవిడిగా అప్రకటిత కరెంట్ కోతలను విధించిన విషయం మరచిపోలేం. విద్యుత్ శాఖధికారులు కోతలు విధిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందు లకు గురి చేసారు. వ్యవ సాయరంగానికి సైతం విద్యుత్ కోతలు తప్పలేదని రైతులు మండిపడ్డారు. విద్యుత్‌శాఖలో అధికారులు, సిబ్బంది మధ్య స మన్వయలోపం, మరమతుల్లో టెక్నికల్ అవగాహన లేకపోవడమే కారణమని ఆ శాఖలోని కొందరు చెప్పుకురావడం గమనార్హం. ఏకంగా అధికారుల, ప్రజాప్రతినిధుల సమీక్షా సమావేశంల్లోనూ విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా బయటకు పొక్కకుండా నాటి కెసిఆర్ సర్కార్ నానా తంటాలు పడింది. ఇప్పుడేమో మూడు నెలలకే విద్యుత్ లేదు..నీళ్లు రావు అంటూ కెసిఆర్ గగ్గోలు పెట్టారు. ఆనాడు సంబంధిత విద్యుత్ శాఖధికారుల్లో మాత్రం చలనం లేదంటు మంత్రులు, ఎమ్మెల్యేలు మండిపడ్డ ఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ ఆ శాఖ అధికారుల్లో మాత్రం చలనం రాలేదు. జిల్లాలో రోజువారీగా విద్యుత్ వినియోగం ప్రస్తుతం గరిష్టంగా 5న్నర మిలియన్ల యూనిట్లుగా ఉంది. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో విద్యుత్ వినియోగం పెరుగు తుందని, విద్యుత్ వినియోగం పెరగడంతో సబ్‌స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ అధికంగా పడటంతో మరమ్మతులు అవుతున్నాయని గతంలో సెలవిచ్చారు. దీనిని నాటి సిఎం కెసిఆర్ సమర్థించారు. రెప్పపాటు కరెంట్ పోలేదని ఇప్పుడేమో మేకపోతు గాంభీర్యం ప్రకటించారు. బిఆర్ఎస్ పాలనలో విద్యుత్‌శాఖ అధికారులు మరమతుల పేరిట సంబంధిత ఏరియానే కాకుండా ఆ ప్రాంతం మొత్తం ఇష్టానుసరంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయితే పాలకులుగా ఎవురున్నా వేసవి, వర్షకాలం వచ్చాయంటే చాలు విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవరిస్తూ ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు సమయం, సందర్భం లేకుండా పవర్‌ను కట్ చేయడంపై ప్రజలు అప్పుడూ, ఇప్పుడూ ఇబ్బందులు పడుతుండటం గమనించవచ్చు. రాత్రి సమయంలోను ఇష్టానుసరంగా పవర్ కట్ చేయడం ఏమిటని పట్టణవాసులు ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని పశ్నించిన ఘటనలు అనేకం ఉన్నాయి. పట్టణ ప్రగతిలో భాగంగా మరమత్తులు చేపడుతున్నామని శాఖ అధికారులు, సిబ్బంది చెప్పుకొచ్చారు. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓ వైపు ఎండలు ముదరడంతో ఉక్కపోతలతో పగలంతా విద్యుత్ లేక ప్రజలు సతమత మవుతుండగా రాత్రి సమయంలోనూ వేళాపాల లేకుండా కోతలు విధించడంతో దోమలతో నిద్రలేక ఇబ్బందులు పడ్డట్లు పట్టణ ప్రజలు ఆ వేదన వ్యక్తం చేసిన రోజలను పఅ÷–పుడే మరచిపోలేం. జిల్లాల్లో ఎక్కడైనా మరమతులు చేయాలన్నా, విద్యుత్ కొత్తలైన్ వేయాలన్నా, టాన్స్ ఫార్మర్లు బిగించాలన్నా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసేవారు. ఎలాంటి ముందస్తు ప్రకటనలు చేయ కుండానే ఇష్టానుసారంగా విద్యుత్ కోతలను విధించేవారు. ఇవన్నీ కెసిఆర్ మరచి పోయారు. ఎక్కడో ఒక్కచోట ఘటన అంటూ ఎదురుదాడి చేసేవారు. ఇప్పుడు కూడా అదే శైలిలో విద్యుత్ కోతలు మొదలయ్యాయని గగ్గోలు పెట్టి కెసిఆర్ అభాసు పాలయ్యారు. విద్యుత్ కోతలు ఎదుర్కొన్న ప్రజలకు కెసిఆర్ మాటలు మంటలు తెప్పించాయి.

# కొండగట్టులో ఏటా తాగునీటి ఎద్దడి

**వేసవిలో మరింత తీవ్రంగా సమస్య - శాశ్వత కోనేటి నిర్మాణం కోసం ఎదురుచూపు**



జగిత్యాల,మార్చి13 (ప్రజామంటలు): వేసవి వస్తుందంటే ప్రముఖ పుణ్యక్షేత్రం కొండపైన తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటోంది. ఏటా సమస్యల ఉన్నా శాశ్వత పరిష్కారం దక్కడం లేదు. గతంలోఅధికారంలో ఉండగా నాటి సిఎం కెసిఆర్ సందర్శించి నిధుల విడుదలకు ప్రకటన చేశారు. కానీ రూపాయి విడుదల కాలేదు..చుక్కనీరు రాలేదు. యేటా హనుమాన్ జయంత్యుత్సవాలకు ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించాల్సిన పరిస్థితి ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో స్నానాలు చేద్దామంటే మురికి నీరు ఉండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రెండవ కోనేరును నిర్మించినా నీరు లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. శాశ్వత పరిష్కారం కోసం సంతల లొద్ది నుంచి నీటిని కొండపైకి తరలించాలని ప్రతిపాదనలు ఉన్నా నిధుల లేమితో వెనుకడుగు వేస్తున్నారు. ఎండాకాలంలోనైతే భక్తులు కొండపై కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండాపోతుంది. ఆలయం చుట్టూ షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మూత్ర శాలలు, స్నానాల గదులు లేకపోవడంతో ఆరుబయటే మల విసర్జనతో పాటు స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఎండాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రం అవుతోంది. కొండగట్టు అంజన్న దేవాలయంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఇక్కడికి వస్తున్న భక్తులు ఆరోపిస్తున్నారు. యేటా భక్తులు పెరుగుతున్నా సౌకర్యాలు మెరుగుపడటం లేదు. యేటా లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడే ఆలయం వద్ద భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు లేకపోవడంతో పాటు బస చేసేందుకు కనీస సౌకర్యాలు లేవు. దీక్షాపరులు నానా అగచాట్లు పడుతుంటారు. భక్తుల సౌకర్యార్థం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆలయ అధికారులు రూ.15 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా బుట్ట దాఖలయ్యాయి. కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో రూ.100 కోట్లతో మాస్టర్ ప్లాన్ కాగితాలకే పరిమితమైంది. కొండపై వెలసిన ఆంజనేయ స్వామి దేవస్థానానికి దాదాపు 500 ఏళ్ల చరిత్ర ఉంది. నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. యేటా ఇక్కడ చైత్ర పౌర్ణమి రోజున చిన్న హనుమాన్ జయంతి, పూర్వాభాద్ర నక్షత, వైశాఖ బహుళ దశమి రోజున పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ రెండు జయంతిలకు కొండగట్టుకు దాదాపు 6 లక్షల మంది దీక్షాపరులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మాల విరమణ చేస్తారు. చిన్న హనుమాన్ జయంతి ఐదు రోజుల పాటు జరుగుతుండగా, 3.50 లక్షల మంది దీక్షాపరులు కొండపైకి వస్తుంటారు. పెద్ద హనుమాన్ జయంతి మూడు రోజుల పాటు జరుగుతుండగా, 2.50 లక్షల మందికి పైగానే భక్తులు వస్తుంటారు. దీనికి తోడు ప్రతి మంగళవారం, శనివారం భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. శ్రావణ మాసంలో భక్తుల తాకిడి చెప్పనలవి కాదు. ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని నాయకులు పేర్కొని ఆరేళ్లు అవుతున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. యేటా ఈ ఆలయానికి రూ.20 కోట్ల మేరకు ఆదాయం వస్తుందని అంచనా. ఆదాయం కూడా భారీగానే వస్తున్నా సర్కారు మాత్రం అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయడం లేదు. రూ.100 కోట్లతో కొండపైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు గతంలో ప్రతిపాదనలు కూడా తయారు చేశారు. కొండపైన ప్రధాన సమస్య వసతి గృహాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు రాత్రి పూట బస చేసేందుకు ఎలాంటి సౌకర్యాలు లేవు. కొండగట్టుపైకి మరో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులు ప్రతిపాదనలు కూడా తయారు చేశారు. అధికారులు, నాయకులు హడావిడి చేసి ఆరేడు మాసాలవుతున్నా ఇప్పటికీ అతీగతీ లేదు. దీంతో కొండగట్టు అంటేనే భక్తులు భయపడాల్సిన పరిస్థితి వస్తుంది.

# కాలోహి దురతి క్రమః ( ఆధ్యాత్మిక చింతన )

తిరుమల,మార్చి13 (ప్రజామంటలు): కాలం భగవత్ స్వరూపం. ఈ సృష్టిలో అత్యంత బలమైనది కాలమే. కాలానికి సమస్త జీవరాశీ వశపడవలసిందే. కాలానికి లొంగకుండా బతకగలిగినది ఈ సృష్టిలో ఏదీ లేదు. అందుకే శ్రీ రామాయణంలో కాలం గురించి చెబుతూ...'కాలోహి దురతి క్రమః' అంటారు మహర్షి వాల్మీకి. అంటే ..కాలాన్ని దాటడం, తనకు వశం చేసుకోవడం, దాన్ని కదలకుండా చేయగలగడం...లోకంలోఎవరికీ సాధ్య పడదు అని. సాధారణ సిద్ధాంతంలో అందరూ కాలానికి వశపడవలసిందే. కాలంలో పుడతారు, కాలంలో పెరుగుతారు, కాలంలోనే శరీరాన్ని విడిచి పెడతారు. అందరూ కాలానికి వశపడి ఉంటారు. కానీ ఎవడు భగవంతుడిచ్చిన జీవితం అనబడే ఈ శరీరంతో ఉండగలిగిన కాలాన్ని సద్వినియోగం చేసుకుంటాడో వాడు తన శరీరాన్ని విడిచి పెట్టేసిన తరువాత కూడా కీర్తి శరీరుడిగా నిలబడిపోతాడు. ఆయనకి కీర్తే శరీరం అవుతుంది. ఆయన కాలంతో సంబంధం లేకుండా యుగాలు దాటిపోయినా కూడా కొన్ని కోట్ల మందికి ప్రేరణగా అలా నిలబడిపోతాడు. అందుకే మనుష్యుని జీవితంలో అన్నిటికన్నా అత్యంత ప్రధానమైనదిగా చెప్పబడేది కాలం విలువను గుర్తించడం. ఆ కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం. ఎవడు కాలం విలువని గుర్తించలేడో ఎవడు కాలాన్ని సద్వినియోగం చేసుకోలేదో వాడు కాలగర్భంలో కలిసిపోతాడు. ఆ జీవితం ఏ విధంగా కూడా ఉపయోగకరం కాదు. తనను తాను ఉద్ధరించుకోవడానికిగానీ, మరొకరిని ఉద్ధరించ డానికిగానీ పనికిరాడు. అందువల్ల అంతా కాలానుగుణంగా నడుచుకుంటూ..మంచి పనులతో కలకాలం నిలిచేలా యశోకీర్తిని సంపాదించుకోవాలి.





## తురగ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

**రాయికల్ మార్చ్ 13 (ప్రజామంటలు):** జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా రాయికల్ మున్సిపల్ కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రాయికల్ మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు మరియు గర్భిణిలకు పండ్లు , బ్రేడ్ ప్యాకెట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తురగ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రజలకు సేవలు చేస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ బర్కం మల్లేష్, సుతారి తిరుపతి, సాయి కిరణ్, వెంకటేష్, సూర్యం, అమిత్, తేజ, వంశీ, రవితేజ, రాజేష్, రాంప్రసాద్, నవీన్ మరియు యూత్ నాయకులు పాల్గొన్నారు.

## పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**రాయికల్ మార్చ్ 13 (ప్రజామంటలు):** జాతీయ పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారము రామాజిపేట లోని పోషణ మాసం పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికల బాల్యారంభ విద్యపై అవగాహన కల్పించడంతో పాటు పరిశుభ్రమైన ఆహార అలవాట్ల పోషక విలువలు కలిగిన ఆహార పదార్థల పై అవగాహన కల్పించారు రక్త హీనత గురించి అవగాహన అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్లు జంబర్తి, జమున, నాగెల్లి రమాదేవి, బెజ్జంకి భాగ్యలక్ష్మి, మండల నిషిత, ఆయమ్మలు, లక్ష్మి, పల్లవి, లక్ష్మి పాల్గొన్నారు.

## డిఏ, పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

**రాయికల్ మార్చ్ 13 (ప్రజామంటలు):**



రాయికల్, భూపతిపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధి లో పని చేస్తున్న ఉపాధ్యాయుల డీఏ బకాయలు చెల్లించాలని పీఆర్టీయు టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. రాయికల్ లో బుధవారం జరిగిన సంఘ సమావేశం లో ఆయన మాట్లాడుతూ.... ఈ సంత్సరం, తో పాటు గత సంత్సరం డీఏ బకాయలు రాక సీపీఎస్ ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా లో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పీఅర్సీ బకాయిలు మూడు మాత్రమే వచ్చాయని, ఇంకా 15 బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి అంతడుపుల గంగారాజం, మండల అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి తాటిపాముల రమేష్, కార్యదర్శి దొంతి సతీష్, కడకుంట్ల అభయరాజ్, ఉషకోలా రాము, లక్కడి రాజారెడ్డి, సిలివెరి రమేష్, సురేందర్, హరికృష్ణ లు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ పర్స రాంబాబుని స్వాగతించిన జగిత్యాల టిఎన్జీవోలు

**జగిత్యాల మార్చి 13 (ప్రజామంటలు):**



జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా బాధ్యతలు స్వీకరించిన పర్స రాంబాబు ను టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పర్స రాంబాబు మాట్లాడుతూ.... ఉద్యోగులందరం సమన్వయంతో పనిచేసి జగిత్యాల జిల్లాను అని రంగాల్లో ముందు ఉంచడానికి కృషి చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జిఒ నాయకులు సాహెద్ బాబు, రవీందర్, రాజేశం, మమత, శైలజ, శ్రావణి, ఇంద్రజ, నర్సయ్య, అయూబ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సంద్రాలపల్లి ప్రాథమిక పాఠశాలలో పోషణ పక్షోత్సవాలు

**కొడిమ్యాల మార్చ్ 13 (ప్రజామంటలు):**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం సంద్రాలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్ వాడి ఆధ్వర్యంలో పోషణ అభియాన్ లో భాగంగా పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, చెత్తను తొలగించుకోవాలని, గోళ్ళు ప్రతి వారంకు ఒకసారి తీసుకోవాలని, కోడిగ్రుడ్లు, ఆకు కూరలు, పండ్లు, తదితర పౌష్టిక ఆహారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి, అంగన్ వాడి టీచర్ బొక్కెమ్ విజయ లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్యంతో చదివితే విజయం మీదే

### పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**హన్మకొండ మార్చ్ 13 (ప్రజామంటలు):** హాసన్ పర్తి పోలీసుల ఆధ్వర్యంలో పదవ తరగతి తుది పరీక్షలకు హాజరువుతున్న ప్రభుత్వ విద్యార్థులకు మీదుగా పరీక్ష ప్యాడ్లతో పాటు పరీక్షకు అవసరమైన సామాగ్రిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. హాసన్ పర్తి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ.... విద్యార్థులు లక్ష్యంతో చదివితే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించగలరని హాసన్ పర్తి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుతూ, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరువుతున్న సుమారు ఐదు వందల మంది విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, ఇతర పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పరీక్షలు అనగానే విద్యార్థులు కంగారు పడవద్దని, పరీక్షల్లో ఉన్నత మార్కులు సాధించాలంటే ప్రణాళికబద్ధంగా చదవాల్సి ఉంటుందని. ముఖ్యముగా చదువు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే పరీక్షల్లో రాణి స్తారని. పాఠశాల చదువులు ఈ పరీక్షలతో పూర్తివుతుందని. ఇకపై తమ బంగారు భవిష్యత్తు కోసం ఉన్నత చదువు లు చదవాల్సి వుంటుంది. ఉన్నత చదువుల సమయంలో విద్యార్థులు తప్పుడు మార్గాలు ఎంచు కోవద్దని. క్రమశిక్షణ తో చదువును ఆలవర్చుకోవాలని. ముందుగానే మీరు సాధించ్చాలనుకున్న లక్ష్యాలను ముందు గా నిర్దేశించుకుని లక్ష్యాలను సాధించెందుకు మరింత కష్ట పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాజీపేట్ ఏసీపీ తిరుమల్, హాసన్ పర్తి ఇన్స్ స్పెక్టర్ సురేష్, ఎంఈవో రామ్ కిషన్ రాజ్ మరియూ ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్ సిక్తా పట్నాయక్

**హన్మకొండ మార్చ్ 13 (ప్రజా మంటలు):**



హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మత్తు పదార్థాల నియంత్రణ పై ఆయా శాఖల అధికారులతో నెలవారి సమీక్ష సమావేశాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో మత్తు పదార్థాల నియంత్రణ పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పోలీస్, ఎక్సైజ్, టీఎస్ న్యాబ్, రైల్వే, జిఆర్పి, విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులను ఆదేశించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాల నిర్వహణతో సమాజంలో మార్పును తీసుకురావచ్చునని అన్నారు. వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి మహమ్మద్ అబ్దుల్ భారీ మాట్లాడుతూ ప్రతినెల రెండో బుధవారం నార్కోటిక్ కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఈవో డా అబ్దుల్ హై, డిఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అగ్రికల్చర్ జెడి రవీందర్ సింగ్, యూనివర్సిటీ లా కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాస్, రైల్వే, జిఆర్పి, టీఎస్ న్యాబ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

### రెడ్డి కార్పొరేషన్ పోరాట సమితి నాయకులు బద్దం శ్రీనివాస్ రెడ్డి



**మల్లాపూర్ మార్చ్ 13 (ప్రజామంటలు):** రెడ్డి హక్కుల కోసం, రెడ్డి కార్పొరేషన్ కోసం గత తొమ్మిదేళ్లుగా చేస్తున్న పోరాటాన్ని గుర్తించి, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వనికి రెడ్డి సంఘం నాయకులు బద్దం. శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి కార్పొరేషన్ సాధనలో ఎన్నో సార్లు అరెస్టులు, నిర్బంధనలు ఎదుర్కున్నామని అవన్ని పోరాటాలకి ఫలితం అని, గత ప్రభుత్వం 2018 మేనిఫెస్టో లో ప్రకటించి కూడా గెలిచాక ఏర్పాటు చేయకుండా రెడ్లని మోసం చేశారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ 100 రోజుల లోపే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ప్రభుత్వ పనితీరుకి నిదర్శనం అని కొనియాడారు. పేద రెడ్లు ప్రభుత్వానికి రుణపడి ఉంటారని కార్పొరేషన్ తో పేద రెడ్లకి ప్రభుత్వ బరోసా ఇవ్వడం హర్షించదగ్గ విషయం అని కార్పొరేషన్ ఏర్పాటు కి సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర మంత్రి వర్గానికి, ప్రభుత్వ పెద్దలకి, సహకరించిన ఎమ్మెల్యే లకు నాటి నుండి కార్పొరేషన్ సాధనలో పోరాడిన అన్ని రెడ్డి సంఘాలకు శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసినందులకు కృతజ్ఞతలు



**మెట్ పల్లి మార్చ్ 13 (ప్రజామంటలు):** మెట్ పల్లి మత్స్య పారిశ్రామిక జిల్లా కార్యవర్గ సభ్యులు మత్స్య పారిశ్రామిక పట్టణ అధ్యక్షులు పర్రె శంకర్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు గంగపుత్ర కార్పొరేషన్ చేయాలని చేసిన విన్నపాన్ని అమలు చేస్తూ గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్ధిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్ లకు మత్స్య పారిశ్రామిక మరియు గంగపుత్రుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## చైల్డ్ ఫోర్నోగ్రఫీ చూడటం చట్టరీత్యా నేరం

**సికింద్రాబాద్ మార్చ్ 13 ( ప్రజామంటలు):**




చైల్డ్ ఫోర్నోగ్రఫీ చూడటం చట్టరీత్యా నేరమని, ఎవరైనా రహస్యంగా చూసిన, వీడియో కంటెంట్ కలిగి ఉన్నవారికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కఠిన చర్యలు తప్పవని అశ్రిత స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ , హైదరాబాద్ జిల్లా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ అలయెన్స్ పార్టనర్ నాగరాజు పేర్కొన్నారు. ఇటీవల తాజాగా చెన్నైలో జరిగిన ఒక సంఘటనలో ఓ వ్యక్తి తన మొబైల్ లో చైల్డ్ ఫోర్నోగ్రఫీకి సంబంధించిన రెండు పైళ్ళు ఉన్నట్లు పోలీసులు గుర్తించారన్నారు. పోలీసులు ఈమేరకు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి, మద్రాస్ కోర్టుకు పంపించారన్నారు. కాని కోర్టు ఇదేమి తప్పు కాదన్నట్లుగా పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వడం సంచలనంగా మారింది. ఇందులో సుప్రీంకోర్టుతో పాటు పలు స్వచ్ఛందసంస్థలు, జోక్యం చేసుకొని అభ్యంతరం చెప్పాయి. ఇందుకు 120 ఎన్.జీ.వో. సంస్థలు దేశవ్యాప్తంగా తమ అభ్యంతరం తెలిపాయి. ఈమేరకు సుప్రీంకోర్టు చైల్డ్ ఫోర్నోగ్రఫీ కంటెంట్ గాని, వీడియోలు గాని ఉంటే కఠిన శిక్షలు తప్పవని తాజాగా హెచ్చరించిందని నాగరాజు వివరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.... చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరీయల్ ఎవరైన ఇంట్లో ఉండి , ప్రైవసీగా చూసినటప్పటికీ సంబంధిత జిల్లా పోలీసులు ఈ విషయాన్ని నిఘా ద్వారా గుర్తిస్తారని, తద్వారా సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అలాగే సెంట్రల్తో పాటు అంతర్జాతీయ సంస్థల నిఘా కూడ ఉంటుందన్న సంగతి ఎవరు కూడ మరవకూడదన్నారు. ఫోర్నోగ్రఫీ పైళ్ళు కలిగిన వారు ఫోక్సో చట్టం ప్రకారం శిక్షించబడతారని తెలిపారు.

## గ్లకోమా వ్యాధిపై గాంధీలో అవెర్నెస్ ర్యాలీ




**సికింద్రాబాద్ మార్చి 13 (ప్రజామంటలు):** గ్లకోమా (నీటి కాసుల వ్యాధి) అవగాహన వారోత్సవాల సందర్భంగా ఈనెల 16 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గాంధీ ఆసుపత్రి అప్తామాలజీ హెచ్.వో.డీ ప్రొ.డా.కే.రవిశేఖర్ రావు తెలిపారు. బుధవారం గాంధీ ఆసుపత్రిలో గ్లకోమా వ్యాధిపై వైద్యులు అవెర్నెస్ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా వ్యాధి లక్షణాలు, నివారణ, ట్రీట్మెంట్ అంశాలపై వివరించారు. గ్లకోమా వ్యాధితో బాధపడుతున్నవారు గాంధీ లో తమ విభాగంలో సంప్రదించి, ట్రీట్మెంట్ పొందవచ్చని డా.కే.రవిశేఖర్ రావు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు ప్రారంభించిన ఈ ర్యాలీలో అప్తామాలజీ హెచ్.వో.డీ డా. కే. రవిశేఖర్ రావు, ఆర్.ఎం.వో. డా. జయకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సింధు, డా. ప్రవీణ్య, డా.సుజని, జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయంలో మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్పర్సన్ గా నియామకమైన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, సన్మానించారు.

## కార్పొరేషన్ల ఏర్పాటు చరిత్రాత్మక నిర్ణయం

### మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**జగిత్యాల మార్చి 13 (ప్రజామంటలు):**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ల ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని తహసిల్ చౌరస్తా వద్ద పద్మశాలి నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ... కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల వ్యవధిలోనే ఎన్నో ఏళ్ల నుండి ఎదురుచూస్తున్న 16 కులాల కార్పొరేషన్ల ఏర్పాటుతో వివిధ కులాల ఐక్యత పోరాటం ఫలించిందని కార్పోరేషన్లు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పద్మశాలి కులస్తులు అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందన్నారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు కు అనుకూలంగా నిర్ణయించిందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు బాసటగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్లు కోసం అనేక ఆందోళన చేసిన స్పందించలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీ పథకాలు 3 నేలల్లో అమల్లోకి తెచ్చారన్నారు. 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆయా కులాల వారందరికీ చేయూత దొరుకుతుందన్నారు. కుల మత భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం దక్కాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 16 కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ సమాజం స్వాగతిస్తుందన్నారు. పద్మశాలి కులస్తుల చిరకాల స్వప్నమైన పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు ప్రభుత్వానికి రుణపడి పద్మశాలి నాయకులు అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, వేములవాడ దేవాలయ ఉత్సవ కమీటి సభ్యుడు అనుమల్ల చంద్రం, మానపురి మహేష్, అడ్వకేట్ సిరిపురం మహేందర్, సిరిపురం నిరంజన్, అలుస దయాకర్, అడువాల శ్రీనివాస్, గాజుల అరవింద్, పోతు సత్యనారాయణ, చక్రపాణి, మ్యాన రమేష్, కటుకం శేఖర్, ఎలిగేటి శంకర్ , అడెపు రాజేష్, నగేష్, ఎలుగందుల రవి, వాసం శంకర్, సింగం భాస్కర్, అడెపు సత్యం విక్రమ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిని ప్రశ్నిస్తే అట్రాసిటీ కేసులు పెడతారా? ఇదెక్కడి న్యాయం?

### హాస్టల్ లో అవినీతిపై విజిలెన్స్ అధికారుల విచారణకు హాస్టల్ వార్డెన్ సిద్ధమేనా?

### ఏ.ఐ.ఎస్.ఎఫ్. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**హనుమకొండ మార్చి 13 (ప్రజామంటలు):** జిల్లా పరిధిలోని భీమారంలో గల బిసి స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ లో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, ఆర్టిఐ వేసి, జిల్లా సంబంధిత బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే హాస్టల్ వార్డెన్ రేణుకుంట్ల ప్రియాంక ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకుడు భాష బోయిన సంతోష్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి, దాదాపుగా వంద మంది వ్యక్తులతో ఫోన్ చేయించి భయభ్రాంతులకు, బెదిరింపులకు పాల్పడటం సమంజసం కాదని ఏ.ఐ.ఎస్.ఎఫ్. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. బుధవారం హనుమకొండ లోని బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ%"%. పేద దళిత, గిరిజన అట్టడుగు వర్గాల రక్షణకు ఉపయోగించాల్సిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ను అవినీతి, అక్రమాలను కప్పి పుచ్చుకోవడానికి హాస్టల్ వార్డెన్ ఉపయోగించుకోవడం శోచనీయమని అన్నారు. ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ను అడ్డుపెట్టుకొని ఎంతటి అవినీతి అక్రమాలకైనా పాల్పడవచ్చునా ? అని ఆయన ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి హాస్టల్ వార్డెన్ దళిత, గిరిజన వర్గాలకు వజ్రాయుధం లాంటి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టును మిస్యూజ్ చేస్తున్నదని ఇలాంటి వారికి వ్యతిరేకంగా దళిత, గిరిజన, బడుగు, బలహీన, వామపక్ష విద్యార్థి సంఘాలు ఉద్యమించాలని కోరారు. భాష బోయిన సంతోష్ పై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పై సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఇప్పటికైనా హాస్టల్ లో జరుగుతున్న అవినీతిపై హాస్టల్ వార్డెన్, సంబంధిత బీసీ సంక్షేమ శాఖ అధికారులు విజిలెన్స్ అధికారుల విచారణకు సిద్ధం కావాలని అన్నారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమం కోసం, విద్యార్థుల హక్కుల కోసం, విద్యారంగ పరిరక్షణ కోసం నిస్వార్థంగా, నిజాయితీగా విద్యార్థి




ఉద్యమాలు నిర్వహిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు భాష బోయిన సంతోష్ పై అక్రమంగా నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అన్వర్, హరీష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో సీ.ఎం, మంత్రుల చిత్ర పటాలకు పాలాభిషేకం

**జగిత్యాల మార్చ్ 13 (ప్రజామంటలు):**





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశం నందు వీరశైవ లింగాయత్ లింగ బలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు బుధవారం జగిత్యాల పట్టణంలో వీరశైవ లింగాయత్ జగిత్యాల శాఖ వారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు పొన్నం ప్రభాకర్. దామోదర్ రాజనర్సింహా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాజీ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ ల చిత్రపటానికి పాలాభిషేకం చేసి పటాకులు పేల్చి రాష్ట్ర మంత్రి వర్గానికి జగిత్యాల శాఖ తరుపున కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్ కెడిసి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశం

**జగిత్యాల మార్చి 13 (ప్రజామంటలు):**
శాతవాహన విశ్వవిద్యాలయం ఆదేశాలు మేరకు రామకృష్ణ డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడు రోజుల ప్రత్యేక శిబిరం నేటితో ముగిసింది. గత ఏడు రోజులుగా యూనిట్ 1 మరియు యూనిట్ 2 ఆధ్వర్యంలో పోరుమల్ల మరియు గుండ్లపల్లి గ్రామాలలో రెండు యూనిట్లుగా ఏర్పడి ఈ శిబిరం ను నిర్వహించడం జరిగింది గత ఏడు రోజులుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బృందాలుగా ఏర్పడి గ్రామంలో వివిధ సేవా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది మరియు అదేవిధంగా వాలంటీర్లకు నిపుణుల చేత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. సేవా కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లను గ్రామస్తులు అభినందించడం జరిగింది. నేటి ఈ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఎంపీపీ ఉమాదేవి పోరుమల్ల మాజీ సర్పంచ్ వర్యులు తిరుపతి రెడ్డి మరియు గుండ్లపల్లి మాజీ సర్పంచ్ సంపత్ మాజీ సింగిల్ విండో చైర్మన్ భూమా రెడ్డి గారు పాల్గొని వాలంటీర్లను ఉద్దేశించి సమాజ సేవ విద్యార్థులకు ఉపయోగపడుతుందని విద్యార్థి క్రమశిక్షణకు ఎన్ఎస్ఎస్ ఉపయోగపడుతుందని మరియు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని సమాజంపై అవగాహన ఉంటుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మరియు ఎన్ఎస్వి కళాశాలల అధినేత యాదరామకృష్ణ పాల్గొని విద్యార్థులకు సమాజం పైన ప్రత్యక్ష అనుభవం ఎన్ ఎస్ ఎస్ ద్వారానే సాధ్యమవుతుందని తెలియజేయడం జరిగింది. మరియు ఈ కార్యక్రమంలో రామకృష్ణ కళాశాల ప్రిన్సిపల్ కె. రాజేందర్ మరియు పీజీ ప్రిన్సిపల్ వెంకట రమేష్ సార్ అధ్యాపక అధ్యాపకేతర బృందం మరియు ఎన్ఎస్ఎస్ పిఓ లు జే. రాకేష్, ఎం.డి. అప్సర్ వాలెంటర్లు పాల్గొన్నారు.




## డ్రైనేజీ నిర్మాణం పనులు వాయిదా వేయాలి

### మున్సిపల్ చైర్పర్సన్ కు వినతి

**జగిత్యాల జగిత్యాల మార్చి 13 (ప్రజామంటలు):**
డ్రైనేజీ నిర్మాణం పనులు వాయిదా వేయాలని మార్కెట్ రోడ్, గృహ యజమానులు, వ్యాపారస్తులు మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ కు వినతిపత్రం అందజేశారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని మార్కెట్ రోడ్ లోని మోచి బజార్ ప్రాంతంలో సరైన రోడ్డు విస్తరణ లేక డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, రోడ్డు విస్తరణ చేపట్టి డ్రైనేజీ పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ గారికి వినతిపత్రాన్ని అందజేసి సమస్యలు విన్నవించారు. ప్రస్తుతం వ్యాపారం అంతంత మాత్రంగా నడుస్తోందని డ్రైనేజీ కట్టడంతో వ్యాపారం పూర్తిగా దెబ్బతింటుందని, పెళ్ళిళ్ళు, రంజాన్ పండుగ ఉన్నందున డ్రైనేజీ విస్తరణ పనులు నిలిపివేయాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో కె. నాగలక్ష్మి, ప్రసాద్, శివ ప్రసాద్, నరేష్, భారతి, శ్రీ రామ్, కార్తిక్ తదితరులు ఉన్నారు.



## కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

**వెల్గటూర్ మార్చి 13 ( ప్రజా మంటలు)**
మండల కేంద్రంలో ఎం పి డి ఓ కార్యా లయంలో బుధవారం రోజు ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో లిప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని, మండలానికి చెందిన 9410904 విలువ గల 94 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తుందని,ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం జరుగుతుందని, ఈ విడితలో చెక్కులు రాని వారికి తర్వాత విడితలో అందజేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పోతారం జాతరలో పాల్గొన్న బిజెపి కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి

**సారంగాపూర్ మార్చి 13 (ప్రజామంటలు):**
పోతారం గ్రామంలో శ్రీ లక్ష్మీదేవి అమ్మవారు జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మండలం అధ్యక్షులు ఎండబెట్ల వరుణ్ కుమార్, గుర్రం భీమన్న, వేణు, రమేష్, చందు, రాజేశం, రమేష్, లక్ష్మణ్, చిరంజీవి, వెంకటేష్, ప్రదీప్, స్వామి మరియు నాయకులు కార్యకర్తలు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

**బుగ్గారం మార్చి 13 (ప్రజామంటలు):**
బుగ్గారం మండల కేంద్రంలో ఎం పిడిఓ కార్యాలయంలో బుధవారం రోజు ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని,మండలానికి చెందిన 80.09280 విలువ గల 80 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని,రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తుందని,ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం జరుగుతుందని, ఈ విడితలో చెక్కులు రాని వారికి తర్వాత విడితలో అందజేస్తామని, ఎస్ ఆర్ ఎస్ పి లో నీటి మట్టం తక్కువగా ఉండటం వల్ల రైతులకు సాగునీరు అందించే విషయంలో కొంత సమస్య ఏర్పడడం జరుగుతుందని దాని గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా భీమనాతి శారద

**కరీంనగర్ మార్చి 13 (ప్రజామంటలు):** తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా కరీంనగర్ చెందిన భీమనాతి శారద ను నియమిస్తూ రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు గత కొన్ని సంవత్సరాలుగా సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మహిళ సాధారికతకు ఎంతో కృషిచేసిన శారద సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం ఆమెకు రాష్ట్ర కమిటీ లో స్థానం కల్పించారు తన నియామకం పట్ల ఆమె రాష్ట్ర అధ్యక్షులు వీర మోహన్ రాష్ట్ర సంఘాల పెద్దలను కృతజ్ఞతలు తెలియజేశారు శారద నియమకం పట్ల ఆమె స్నేహితులు అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ నియమాకానికి కృషిచేసిన పెద్దలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఎమ్మెల్సీ కవిత జన్మదిన సందర్భంగా వాల్మీకి ఆవాసం లో అన్నదానం చేసిన జెడ్పి చైర్ పర్సన్ వసంత

**జగిత్యాల మార్చ్ 13 (ప్రజామంటలు):**
బతుకమ్మ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన నాయకురాలు,తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు,శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవితక్క జన్మదినాన్ని పురస్కరించుకొని వాల్మీకి ఆవాసంలో అన్నదానం నిర్వహించి,స్వయంగా ప్రతిఒక్కరికీ వడ్డించి పిల్లలతో కలిసి భోజనం చేసిన జిల్లా జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్.అనంతరం చిన్నారులతో మాట్లాడుతూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్న జెడ్పీ చైర్ పర్సన్. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్క పుట్టినరోజు బిఆర్ఎస్ మహిళ శ్రేణులకు గొప్ప పండుగని,ఈ సందర్భంగా వాల్మీకి ఆవాసంలో పిల్లలందరికీ భోజనం పెట్టడం చాలా సంతృప్తినిచిందని ముందు ముందు కూడా ఈ వాల్మీకి ఆవాసానికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంపీపీ లక్ష్మీ, పాక్స్ చైర్మన్లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, ఎంపీటీసీ దమ్మ సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు వొల్లెం మల్లేశం, నాయకులు వెంకటేశ్వర్ రావు, వాల్మీకి ఆవాసం ఇంఛార్జి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## నిజాయితీ చాటుకున్న జగిత్యాల డిపో 'మహిళా కండక్టర్ షబానా బేగం'

**జగిత్యాల మార్చి 13 (ప్రజామంటలు):**
జగిత్యాల డిపోకు చెందిన మహిళా కండక్టర్ షబానా బేగం విధులు నిర్వహిస్తున్న బస్ లో దొరికిన బంగారు నగలను ప్రయాణికురాలికి తిరిగి అప్పగించి తన నిజాయితీ చాటుకున్నారు. రాయికల్ – ఇటిక్యాల బస్సులో ప్రయాణిస్తున్న బిట్ల లక్ష్మి తన తులంనర బంగారు పుస్తెల తాడును బస్సులో పోగొట్టుకున్నారు. అట్టి పుస్తెలతాడు షబానా బేగంకు దొరుకగా బస్ డిపోలో అందించి తన నిజాయితీ చాటుకున్నారు.



## గృహజ్యోతి పథకం అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి

**ఇబ్రహీంపట్నం మార్చ్ 13 (ప్రజామంటలు):**
ఇబ్రహింపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా జీరో బిల్లు కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ప్రభుత్వం కల్పిస్తుందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియూగము చేసుకోవాలని, ఎవరికైనా సాంకేతిక లోపంతో జీరో బిల్లు రాకపోతే తమ దృష్టికి తెస్తె సంబదిత అదికారులతో తమకు జిరో బిల్లు వర్తించేల చుస్తామని హమి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విధ్యుత్ లైన్ మెన్, కొలిపాక రాజు, మీటర్ రిడింగ్ సిబ్బంది కిషోర్, కాంగ్రెస్ పార్టీ మండల సేవదల్ అధ్యక్షుడు నాంపెల్లి వెంకటాద్రి, నాయకులు గుమ్మల రమేష్, బుర్రి ముత్యం, గుమ్మల నరేష్, బస సోమన్న, తరి రామనుజం, మాట్ల రవితేజ తదితరులు పాల్గొన్నారు.



## మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సీఎం, ఎమ్మెల్సీ జీవన్, ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలాభిషేకం

**జగిత్యాల మార్చ్ 13 (ప్రజామంటలు):**
జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో మున్నూరుకాపు సంఘం అధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి బండారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞత సమావేశాన్ని నిర్వహించారు., సంఘ నాయకులతో ర్యాలీగా వెళ్లి మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వొడ్నాల రాజశేఖర్, హరిఅశోక్ కుమార్ మాట్లాడుతూ.... మా ప్రభుత్వం వస్తే మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి వంద రోజుల్లోనే కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన మంత్రి వర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారి రాజ్ కుమార్, దీటి అంజయ్య పటేల్, వొడ్నాల రాజశేఖర్, హరి అశోక్ కుమార్, ముసిపట్ల లక్ష్మినారాయణ, చిట్ల అంజన్న, ఆడప గంగన్న, అంగలి రాజన్న, సిరిపురం రాజేశం,చిట్ల రవి, , ఆకుల నాగరాజు, బండారి విజయ్, తోట నరేష్, గోపు రాజేష్, జంగిలి చంద్రమౌళి, గంగం జలజ, జంగిలి రవికుమార్, అదుముల్ల నరేందర్, బాస మహేష్, ముస్కె శ్రీనివాస్, జంగిలి ధర్మేందర్, చెవుల గంగన్న, పిట్ట రాజన్న, మంగి రవి, వొడ్నాల జగన్, జంగిలి రామానందం, దొనకంటి కిరణ్, వరుద శ్రీనివాస్, సిద్ది దశరథం, తిరుపురం సాయికృష్ణ, బలిజపెల్లి భూమన్న, కడారి రాజేందర్, దేవెందర్, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందుర్తి లో ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ పునప్రతిష్ట పూజలు, హెూమాలలో పాల్గొన్న మహిళలు

**చిగురుమామిడి మార్చ్ 13 (ప్రజామంటలు):**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అయ్యవారు భాస్కర్ చారి ఆధ్వర్యంలో మూడు రోజుల నుండి అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం ఉదయం నుంచి పూజ కార్యక్రమాలు గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహపూజ, వాస్తుపూజ అగ్నిస్థాపన- సాయంత్రం జలాదివాసం మంగళవారం ఉదయం పూజలు, హెూమాలు సాయంత్రం డప్పుచప్పులతో పోచమ్మ తల్లి ని ఊరేగింపు గా తీసుకువచ్చారు.. అనంతరం దాన్యదివాస బుధవారం ఉదయం యంత్రస్థాపన, విగ్రహప్రతిష్ఠ అష్టదిగ్బంధన-నేత్రో స్కలన, జిష్టికుంభం పూర్ణాహుతి జరిగాయి. అనంతరం గుడి భక్తులు మాట్లాడుతూ.... ధన రూపంలో వస్తు రూపంలో శ్రమ రూపంలో చేసిన వారందరికీ అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు. అలాగే పోచమ్మ గుడి కి బూదాత పోతరవేని బక్కయ్య, ఆలయ నిర్మాణ దాత పున్నా%శీ% బాలరాజు, పోచమ్మ తల్లి విగ్రహ దాత ఆకుల వెంకటేష్, ఆలయ (సుతారి దాత) చింతపూల రవీందర్, పోచమ్మ టెంపుల్ దాతలు చింతపూల ఆంజనేయులు, చింతపూల నాగయ్య, చింతపూల ఈశ్వరయ్య, చింతపూల మహేందర్, చింతపూల తిరుపతి, వేముల రవీందర్ %ఐ% దేవేంద్ర,గట్టు రమేష్, ఆకుల వేకటేశ్, డా. రాజేందర్, చింతపూల సాయన్న, చింతపూల కర్ర బాలయ్య, ఆకుల మొగిలి, ఆకుల శ్రీనివాస్, చింతపూల రాజయ్య, చింతపూల రాము, మౌసమ్ ఇలేష్ చింతపూల రాజుయ్య, చింతపూల విజమ్ కుమర్, చింతపూల లక్ష్మయ్య, గుడి భక్తులు గుడి దాతలు మహిళలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు మహా అన్నదాన కార్యక్రమం జరిగింది.



## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి

**భీమదేవరపల్లి మార్చ్ 13 (ప్రజామంటలు):**
ఎన్నో ఏళ్ల ఉద్యమం ఫలితంగా కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా మంగళవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం అభినందనీయం అని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి దాట వేశారని, అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో కాంగ్రెస్ పార్టీ తాము ఇచ్చిన హామీ నిలబెట్టుకుందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సుమారు పది ఏళ్ల నుండి గ్రామ, మండల జిల్లా, రాష్ట్ర స్థాయిలో రెడ్డి కార్పొరేషన్ సాధనకు సభలు, సమావేశాలు పెట్టి రెడ్లలో ఐక్యత తీసుకురావడం జరిగిందని అన్నారు. నిరుపేద రెడ్లు ఎన్నో ఇబ్బందులు అనుభవించారని అన్నారు. అందరి పోరాట ఫలితంగా కాంగ్రెస్ పార్టీ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడం ప్రతీ రెడ్డిబిడ్డకి గర్వ కారణం అన్నారు. అన్ని జిల్లాలలో పేద రెడ్ల పోరాట ఫలితంగా వారి కష్టాలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర క్యాబినెట్ మంత్రులకు, ఎమ్మెల్యేలకు ముఖ్యంగా రాష్ట్రంలో అన్ని పేద వర్గాలను అభివృద్ధి పరచాలని తపనతో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో పాటు అందరూ మంత్రులకు తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్పొరేషన్ ను చట్టబద్ధతతో, 10 వేల కోట్లతో ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేషన్ ఏర్పాటు పట్ల రెడ్డి సంఘం నాయకులు అర్జుల కిషన్ రెడ్డి, నల్ల రాజిరెడ్డి, రావుల నర్సింహ రెడ్డి, చాడ జై హింద్ రెడ్డి, కామిడి సతీష్ రెడ్డి, మాడుగుల పాపిరెడ్డి, వీసం రమణారెడ్డి, హనుమంత రెడ్డి, రాధారపు సంజీవ రెడ్డి, కంది గోపాల్ రెడ్డి, గోలి బక్కారెడ్డి, చల్ల నర్సింహ రెడ్డి, రావుల రమెందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ముదిగంటి వెంకట్ రెడ్డి, గంగిడి ప్రభాకర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంఘం ఆరుట్ల లోకమంత రెడ్డి, గొట్టే మొక్కుల ప్రభాకర్ రెడ్డి, చందుపట్ల తిరుపతి రెడ్డి, పల్లె జైపాల్ రెడ్డి, కోమీ రెడ్డి బూమిరెడ్డి, రెడ్డి సంధ్యారెడ్డి, బొబ్బ మధుసూధన్ రెడ్డి, ఎడ్ల సుదర్శన్ రెడ్డి, బిళ్ల రాజి రెడ్డి లు హర్షం వ్యక్తం చేశారు.



## పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

### గొల్లపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**జగిత్యాల మార్చి 13 (ప్రజామంటలు):**
ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ సూచించారు. బుధవారం ఆకస్మికంగా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ పరిసరాలను మరియు పోలీస్ స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్ హెచ్ వో, రెస్ట్ రూమ్, లాక్ అప్ రూమ్ ను పరిశీలించారు. 5%ూ% అమలు తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏయే విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహించాలని , సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలతోపాటు యువతను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీ.ఐ. రామ్ నర్సింహారెడ్డి, ఎస్.ఐ. సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.




## వీరశైవ లింగాయత్ లింగ బలిజ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

### జిల్లా సంఘం సభ్యులు మాణిక్యం గంగాధర్

**రాయికల్ మార్చి 13 (ప్రజామంటలు):**
రాష్ట్ర వీర శైవ లింగ యాత్ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల జగిత్యాల జిల్లా వీర శైవ లింగాయత్ నాయకులు మాణిక్యం గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు ఇట్టి సందర్భంగా అయన మాట్లాడుతూ.... రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం, తెలంగాణ రాష్ట్రం ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నా కార్పొరేషన్ ను, నూతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడగానే, వీరశైవ లింగాయత్ లింగ బలిజ ఫైనాన్షియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయుటకు నిర్ణయించడం అభినందనీయం, రాష్ట్ర వ్యాప్త వీరశైవ లింగాయత్ లింగ బలిజల చిరకాల కోరిక నెరవేర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర మంత్రులకు, జగిత్యాల జిల్లా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం తరపున ధన్యవాదాములు తెలియచేస్తున్నాము అని అధికారం వచ్చిన వంద రోజుల్లో సుస్థిరమైన ప్రజాపాలన ఏర్పాటు దిశగా అడుగులు వేస్తూ, చారిత్రక నిర్ణయం తీసుకొని బీద వీరశైవ లింగాయత్ లింగ బలిజల సంక్షేమానికి దోహద పడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి యావత్ తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజలు సర్వదా రుణపడి ఉంటారని గంగాధర్ తెలిపారు.



## భూ సేకరణ పనులు త్వరిత గతిన చేపట్టాలి

### కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

**జగిత్యాల మార్చ్ 13 (ప్రజామంటలు):**
భూ సేకరణ పనులు త్వరిత గతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. బుధవారం కేంద్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో జాతీయ రహదారి నెంబర్ 63, రాష్ట్ర రహదారి 563 నిర్మాణ పనులకు భూసేకరణ పనులు నిర్దిష్ట సమయానికి సేకరణ జరగాలని సంభందిత మండల అధికారులను ఆదేశించారు. గతంలో సేకరించవలసిన భూములతో పాటు కొత్తగా ప్రతిపాదించిన భూముల సేకరణ కూడా తొందరగా చేపట్టాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ మధుసూదన్, భూ కొలతల సహాయ సంచాలకులు వెంకట్ రెడ్డి, తహశీల్దార్లు, సంభందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.






# లాల్ సలాం ఫెయిల్యూర్‌కు అదే కారణమా
# 21 రోజుల షూట్ మిస్సయ్యిందన్న ఐశ్వర్య

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'లాల్ సలాం' ఆయన కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ దీనికి దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో విజయాన్ని సాధించలేదు. తాజాగా దీనిపై ఐశ్వర్య ఓ షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. 21 రోజుల షూటింగ్ ఫుటేజ్ పోయిందని దాని ప్రభావం సినిమా ఫలితంపై పడిందన్నారు. 'సినిమాలోని ప్రధాన భాగానికి సంబంధించిన షూటింగ్ ఫుటేజ్ మిస్సయింది. దాదాపు 21 రోజుల ఫుటేజ్ అది. పూర్తి బాధ్యతారాహిత్యం కారణంగానే ఇలా జరిగింది. క్రికెట్‌కు సంబంధించిన సన్నివేశాలను 20 కెమెరాలతో నిజమైన మ్యాచ్‌లా షూట్ చేశాం. మా దురదృష్టం కొద్ది పోగొట్టుకున్నాం. మాకు ఏం చేయాలో అర్థంకాలేదు. అప్పటికే విష్ణు, నాన్న(రజనీకాంత్)తో సహా అందరూ గెటప్‌లు మార్చుకున్నారు. అందుకే రీ షూట్ చేయలేకపోయాం. చివరికి మిగిలి ఉన్న దానితో సినిమాను ఎడిట్ చేశాం' అని చెప్పారు. ఇక ఈ 'లాల్ సలాం'పై వచ్చిన విమర్శల గురించి మాట్లాడుతూ.. 'వ్యక్తిగతంగా సినిమా విషయంలో సంతృప్తి చెందాను. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించాం. అందుకే మలుపులు ఎక్కువ లేవు. కథంతా సూటిగా, సింపుల్‌గా ఉంటుంది. నేను విమర్శలను, ప్రశంసలను సమానంగా తీసుకుంటాను. నన్ను నేను మెరుగుపరుచుకోవడానికి ఈ చిత్రం సాయపడింది' అన్నారు. ఇటీవల కూడా ఐశ్వర్య ఈ సినిమా ఫెయిల్యూర్‌పై మాట్లాడుతూ.. రజనీకాంత్ పాత్ర కోసం మొదటరాసుకున్న స్క్రిప్ట్‌లో మార్పులు చేశామన్నారు. ఆయన కోసం సినిమాకు వచ్చేవారు నిరాశకు గురికాకూడదని ఆ పాత్రలో మార్పులు చేసి మొదటి నుంచి ఉండేలా స్క్రిప్ట్ ఎడిట్ చేసినట్లు తెలిపారు. దాని వల్ల ప్రేక్షకులు గందరగోళానికి గురైనట్లు చెప్పారు.




# రామాయణంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్

నితేశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ ప్రొడ్యూసర్లతో కలిసి అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మకంగా రామాయణాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో రాముడిగా స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. తాజాగా ఈ విషయంపై 'రామాయణ్' సీరియల్‌లో రాముడిగా నటించిన అరుణ్ గోవిల్ మాట్లాడారు. 'రణ్‌బీర్ గొప్ప నటుడు. తన యాక్టింగ్‌కు ఎన్నో అవార్డులు వచ్చాయి. చాలా కష్టపడి పనిచేస్తాడు. సంస్కారవంతుడు. నైతిక విలువలు కలిగిన వ్యక్తి. భారతీయ సంస్కృతిని గౌరవిస్తాడు. తన పాత్రకు వందశాతం న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాడు. రాముడిగా కూడా ఉత్తమంగా నటిస్తాడని నా అభిప్రాయం' అని చెప్పారు. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఏప్రిల్‌లో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీరామ నవమి సందర్భంగా సినిమాపై అప్‌డేట్ ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు ఎన్నో రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీని వీఎఫ్‌ఎక్స్ ఎఫెక్ట్‌ల కోసం నితేశ్ తివారీ టీమ్ ఆస్కార్ విన్నింగ్ కంపెనీ డీఎన్‌ఈజీతో సంప్రదింపులు జరిపిందట. ఈ చిత్రం కోసం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని వినియోగించాలని చిత్రబృందం యోచిస్తోందని అందుకే లుక్ టెస్ట్ కోసం కూడా త్రీడీ టెక్నాలజీని ఉపయోగించారని ప్రచారం సాగుతోంది.

# ప్రేమలు సినిమా చూసి ఆనందించా : మహేశ్ బాబు



రీసెంట్‌గా విడుదలై.. బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోన్న చిన్న సినిమా 'ప్రేమలు' పై సోషల్ మీడియా వేదికగా సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రశంసల వర్షం కురిపించారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమా చూస్తూ హాయిగా నవ్వుకున్నట్లుగా ఆయన చెప్పుకొచ్చారు. ఫిబ్రవరి 9న విడుదలైన మలయాళ చిత్రం 'ప్రేమలు' అక్కడ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ఈ మూవీకి మంచి ప్రశంసలు దక్కాయి. మంచి కామెడీ, లవ్ అనే అంశాలతో 'ప్రేమలు' సినిమా స్టోరీ లైన్, దాన్ని తెరకెక్కించిన విధానాన్ని ప్రేక్షకులు అద్భుతమని మెచ్చుకున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు పాన్ ఇండియా డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ అందించారు. మార్చి 8న విడుదలైన ఈ మూవీ తెలుగు వెర్షన్‌కు.. విడుదలైనప్పటి నుండి చాలా మంచి స్పందన వస్తోంది. సినిమా చూసిన ప్రముఖులెందరో ఈ సినిమాను కొనియాడుతున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు.. సోషల్ మీడియా వేదికగా సినిమాను, సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించిన కార్తికేయ ను అభినందించారు. తెలుగు ప్రేక్షకులకు 'ప్రేమలు' చిత్రాన్ని అందించిన కార్తికేయకు ధన్యవాదాలు. బాగా ఎంజాయ్ చేశాను. చివరిగా నేను ఏ సినిమా చూసి ఇలా ఎంజాయ్ చేశానో గుర్తు లేదు. ఫ్యామిలీ మొత్తానికి ఈ సినిమా బాగా నచ్చింది. సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ అద్భుతమైన నటనను కనబరిచారు. టీమ్ మొత్తానికి నా అభినందనలు అని సూపర్ స్టార్ మహేష్ బాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు లైక్స్, కామెంట్స్‌కి అయితే లెక్కే లేదు. ఒక మంచి సినిమాను ప్రమోట్ చేయడానికి, ఒక మంచి సినిమాను ప్రేక్షకులకు చేరవేయడానికి మహేష్ బాబు ఎప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపించారంటూ.. అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.




# షరతులు వర్తిస్తాయి..సెన్సార్ పూర్తి



చైతన్య రావ్, భూమి శెట్టి జంటగా నటించిన సినిమా 'షరతులు వర్తిస్తాయి' తాజాగా ఈ సినిమాకు సెన్సార్ ప్రశంసలు దక్కాయి. కుమారస్వామి(అక్షర) దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టార్ లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై శ్రీలత - నాగార్జున సామల, శారదా - శ్రీష్ కుమార్ గుండా, విజయ - డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. ఈ నెల 15న గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కాబోతోంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సినిమాకు సెన్సార్ సభ్యులు క్లీన్ యు సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ సందర్భంగా మానవీయ విలువలు ఉన్న ఒక మంచి సినిమా రూపొందించారంటూ దర్శకుడు కుమారస్వామికి సెన్సార్ సభ్యులు ప్రశంసలు అందజేశారు. ఈ చిత్ర దర్శకుడు కుమారస్వామి కూడా సెన్సార్ బోర్డ్ సభ్యుడు అనే విషయం తెలియకుండానే బోర్డ్ మెంబర్స్ సినిమాను చూశారు. తర్వాత తమ సభ్యుడే ఇంత గొప్ప సినిమా తీయడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సినిమాపై సెన్సార్ బృందం స్పందిస్తూ.. తెలంగాణ సినిమా అనగానే కొన్నాళ్లుగా కనిపిస్తోన్న విపరీతమైన మద్యం సన్నివేశాలు, నిర్లక్ష్యపు ధోరణులకు భిన్నంగా 'షరతులు వర్తిస్తాయి'లో ఒక గొప్ప మానవీయ విలువలు చూపించారు. మానవ సంబంధాలతో నిండి ఉన్న ఇలాంటి సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలని, తెలంగాణ నేపథ్యంలోనే కనిపించినా.. ఒక యూనిక్ కంటెంట్ ఈ చిత్రంలో ఉందని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించి ఇప్పటి వరకు విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ మంచి స్పందనను రాబట్టుకున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'పన్నెండు గుంజలా పెల్లి పందిరి' అనే పాట ప్రస్తుతం తెలంగాణలోని అన్ని పెళ్లి వేడుకల్లోనూ వినిపిస్తోంది. ఇప్పుడు సెన్సార్ బోర్డ్ నుంచి ప్రశంసలు దక్కడం సినిమా విజయం పట్ల మరింత నమ్మకాన్ని పెంచిందని ఈ సందర్భంగా నిర్మాత చెప్పుకొచ్చారు.

## శ్రీవారిని దర్శించుకున్న గామి టీమ్

తిరుమల శ్రీవారిని సినీ నటుడు విశ్వక్ సేన్ దర్శించుకున్నారు. బుధవారంవీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో.. ఇటీవల విడుదలైన తన 'గామి' చిత్ర యూనిట్‌తో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వీరికి రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.







## ఫ్యామిలీ స్టార్ నుంచి కళ్యాణి వచ్చా..వచ్చా పాట విడుదల

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'ఫ్యామిలీస్టార్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. 'కల్యాణి వచ్చా వచ్చా...' అంటూ సాగే యుగళ గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, గోపీసుందర్ స్వరాలు సమకూర్చారు. మంగ్లీ, కార్తీక్ ఆలపించారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్‌రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పరుశురామ్ పెట్ల దర్శకుడు. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్.







## పెళ్లి పీటలెక్కిన నటి మీరా చోప్రా

బాలీవుడ్ నటి మీరా చోప్రా వివాహబంధంలోకి అడుగుపెట్టింది. ముంబైకి చెందిన రక్షిత్ అనే ప్రముఖ వ్యాపారవేత్తతో మీరా మంగళవారం ఏడడుగులు వేసింది. రాజస్థాన్‌లోని ఓ రిసార్ట్‌లో వీరి పెళ్లి జరుగగా మీరా చోప్రా తన వివాహ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ఇక ఇరు కుటుంబాల సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఈ పెళ్లి వేడుక గ్రాండ్‌గా జరిగింది. ప్రియాంక చోప్రా, పరిణితి చోప్రా.. మీరాకు కజిన్లు. చోప్రా కుటుంబ సభ్యులు కూడా ఈ వివాహానికి హాజరయ్యారు. అయితే ఈ పెళ్లికి ప్రియాంక చోప్రా రాలేదు.


పవన్ కళ్యాణ్ 'బంగారం' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది మీరా చోప్రా. ఆ తర్వాత 'వానస, మారో', 'గ్రీకు వీరుడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఇక చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న మీరా ప్రస్తుతం సఫేద్ అనే సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 8 మంది బ్యాట్స్‌మెన్, 7గురు ఆల్‌రౌండర్లు, 10 మంది బౌలర్లు

### బెంగళూరులో ఇంపాక్ట్ ప్లేయర్స్ లిస్టు విడుదల

ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్-17 కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 25 మంది సభ్యులతో కూడిన జట్టుతో వరుసలో ఉంది. ఈ జట్టులో 8 మంది బ్యాట్స్‌మెన్, 7గురు ఆల్‌రౌండర్లు, 10 మంది బౌలర్లు ఉన్నారు. వీరిలో ఆర్‌సీబీకి ఇంపాక్ట్ ప్లేయర్ ఎవరు అని అడగడం సహజం. అయితే ఇక్కడ గమనించాల్సిన ప్రధాన అంశం ఏమిటంటే.. ఆర్సీబీ జట్టులో 7 మంది ఆల్ రౌండర్లు ఉన్నారు. కాబట్టి, ఇక్కడ బ్యాటర్లకు బదులుగా, బౌలర్లు, ఇంపాక్ట్ ప్లేయర్లు ఆడబోతున్నారు.జట్టులోని టాప్-4 బ్యాట్స్‌మెన్స్‌లో రజత్ పాటిదార్ కనిపించడం ఖాయం. అందువల్ల, అతనికి బదులుగా ఒక బౌలర్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా రంగంలోకి దిగే అవకాశం ఎక్కువగా ఉంది.ఇక్కడ ఇంపాక్ట్ ప్లేయర్‌లుగా మహిపాల్ లోమ్రార్, అనుజ్ రావత్, ఆకాష్ దీప్, యశ్ దయాల్, కర్ణ్ శర్మలను ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఎందుకంటే గత సీజన్‌లోనూ %=జదీ% చాలా మ్యాచ్‌లలో అనుజ్ రావత్, కర్ణ్ శర్మలను ఇంపాక్ట్ ప్లేయర్‌లుగా ఉంచింది. అంటే, బ్యాటర్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా రావాలంటే, అనుజ్ రావత్ లేదా మహిపాల్ లోమ్రార్‌ను ఉపయోగించవచ్చు. అలాగే, మీరు ఇంపాక్ట్ ప్లేయర్‌గా బౌలర్‌ను ఉపయోగించాలనుకుంటే, ఆకాష్ దీప్, యశ్ దయాల్ లేదా కర్ణ్ శర్మకు అవకాశం ఇవ్వవచ్చు. ఇక్కడ గమనించాల్సిన ప్రధాన విషయం ఏమిటంటే, ఒక విదేశీ ఆటగాడిని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉపయోగించాలంటే, %=జదీ% ప్లేయింగ్ ఎలెవెన్‌లో ముగ్గురు లేదా అంతకంటే తక్కువ విదేశీ ఆటగాళ్లను అనుమతించాలి. అయితే, గత సీజన్‌లో ఆర్‌సీబీ అలాంటి దుస్సాహసానికి పాల్పడదు. కాబట్టి ఈసారి కూడా నలుగురు విదేశీ ఆటగాళ్లతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఫీల్డింగ్ చేయనుంది. భారత ఆటగాళ్లను ఇంపాక్ట్ ప్లేయర్‌లుగా ఉపయోగించుకుంటారని కూడా చెప్పవచ్చు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు: ఫాఫ్ డు ప్లెసిస్, గ్లెన్ మాక్స్‌వెల్, విరాట్ కోహ్లి, రజత్ పటీదార్, అనుజ్ రావత్, దినేష్ కార్తీక్, సుయాష్ ప్రభుదేశాయ్, విల్ జాక్స్, మహిపాల్ లొమ్రోర్, కర్ణ్ శర్మ, మనోజ్ భాండాగే, మయాంక్ దాగర్, విజయ్‌కుమార్ వైషాక్, ఆకాశ్ దీప్, మోహమ్ దీప్ , మహ్మద్ సిరాజ్, రీస్ టోప్లీ, హిమాన్షు శర్మ, రాజన్ కుమార్, కామెరాన్ గ్రీన్, అల్జారీ జోసెఫ్, యష్ దయాల్, టామ్ కరణ్, లక్కీ ఫెర్గూసన్, స్వప్నిల్ సింగ్, సౌరవ్ చౌహాన్.

## కోహ్లీ ఫ్యాన్స్‌లో కల్లోలం రేపుతుంది



అమ్మ చేతి వంట, విరాట్ కోహ్లీ కవర్ డ్రైవ్ మర్చిపోగలమా? అది ఎప్పటికీ ఎన్నటికీ సాధ్యపడే విషయం కాదు. కానీ ఇప్పుడు మర్చిపోమంటోందా %దీజజ×%? కొత్త ఆవకాయలా, హైదరాబాద్ బిర్యానీలా ఘాటుఘాటుగా సాగే కోహ్లీ బ్యాటింగ్ సొగసు చూడతరమా? కోహ్లీ లేకుంటే.. ఉప్పు లేని పప్పులా, కారం లేని కూరలా, మిర్చి లేని మిరపకాయ బజ్జీలా టీమిండియా మారిపోదా? రాబోయే టీ-20 వాల్డ్ కప్‌లో కోహ్లీ ఆడడం లేదా. పొట్టి ఫార్మాట్‌కు ఈ గట్టి బ్యాట్స్‌మన్ దూరం కానున్నాడా? ఈ వార్తలే ఇప్పుడు క్రికెట్ ఫ్యాన్స్‌ను కలవర పరుస్తున్నాయి. కోహ్లీ ఫ్యాన్స్‌లో కల్లోలం రేపుతున్నాయి.జూన్‌లో మొదలయ్యే టీ-20 ప్రపంచ కప్‌లో భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఆడడం లేదు. యువ క్రికెటర్ల కోసం వైదొలుగుతున్నాడు.. ఇవీ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న . బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ కూడా విరాట్‌తో మాట్లాడినట్లు కథనాలు వచ్చాయి. అయితే, ఐపీఎల్-2024 సీజన్‌లో విరాట్ కోహ్లీ ప్రదర్శన ఆధారంగా అతడి భవితవ్యం తేలనుందనే వార్తలూ వస్తున్నాయి. ఈ క్రమంలో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ స్టువర్ట్ బ్రాడ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ లేకపోతే వరల్డ్ కప్ టోర్నీకి క్రేజ్ తగ్గడం ఖాయమన్నాడు. వెస్టిండీస్ - అమెరికా వేదికగా పొట్టి కప్ సంబరం జూన్ నుంచి ప్రారంభం కానుంది. సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు నిజం కాకూడదు. అభిమానుల కోణంలో చూస్తే.. ఈ వరల్డ్ కప్‌ను ఐసీసీ అమెరికాలో నిర్వహించడానికి చాలా కారణాలు ఉన్నాయి. మరీ ముఖ్యంగా భారత్ - పాకిస్తాన్ మ్యాచ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందరి దృష్టిని ఆకర్షించే టాప్ ప్లేయర్ విరాట్ కోహ్లీ తప్పకుండా పొట్టి కప్ కోసం ఎంపిక అవుతాడు అంటూ ఇంగ్లడ్ ప్లేయర్ బ్రాడ్ పోస్టు చేశాడు.విరాట్ కోహ్లీ వ్యక్తిగత కారణాలతో ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆడలేదు. ఇటీవలే అనుష్క శర్మ రెండో బిడ్డకు జన్మించిన సంగతి తెలిసిందే. చాలా రోజుల విరామం తర్వాత విరాట్ ఐపీఎల్ 2024 సీజన్ కోసం సిద్ధమవుతున్నాడు. టీ-20 ప్రపంచకప్ జట్టును ప్రకటించడానికి మే ఒకటో తేదీ...చివరి రోజు. అప్పటిదాకా ఈ విషయంపై స్పష్టత వచ్చేలా కనిపించడం లేదు. మే ఒకటి వరకు కోహ్లీ అభిమానులకు ఉత్కంఠ తప్పదంటున్నాయి క్రికెట్ వర్గాలు. అటు విరాట్ ఫ్యాన్స్ అయితే.. టీమిండియా అత్యుత్తమ ప్లేయర్‌ను టీ20 ప్రపంచకప్ జట్టులోకి తీసుకోకపోతే.. బీసీసీఐ ఆఫీస్ తగలబెట్టేస్తామని ఫ్యాన్స్ అంటున్నారు. మరి ఈ వార్తలపై బీసీసీఐ ఎలా స్పందిస్తుందో చూడాలి.

## డబ్బు కోసమే ఐపీఎల్ ఆడటం సరికాదు



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ ఎడిషన్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మార్చి 22న ఎంఏ చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌తో మెగా టోర్నీకి తెరలేవనుంది. ఈ సీజన్ ద్వారా స్టార్ ప్లేయర్ హార్దిక్ పాండ్యా ముంబై జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. ముంబైకి ఐదు టైటిల్స్ అందించిన రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వన్డే ప్రపంచకప్ 2023లో గాయపడిన హార్దిక్.. కోలుకుని ప్రాక్టీస్ చేస్తున్నాడు. దాదాపు నాలుగు నెలల పాటు మైదానానికి దూరంగా ఉన్న హార్దిక్.. ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా మారింది. వన్డే ప్రపంచకప్ 2023 అనంతరం హార్దిక్ పాండ్యా దేశవాళీ, జాతీయ జట్టుకు ఆడకుండా నేరుగా ఐపీఎల్‌లో ఆడడంపై టీమిండియా మాజీ క్రికెటర్ ప్రవీణ్ కుమార్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. డబ్బు సంపాదన ముఖ్యమే అని, అందులో తప్పు ఏమీ లేదు కానీ తొలుత రాష్ట్రం, దేశం కోసం ఆడితే బాగుంటుందన్నాడు. ఓ ఇంటర్వ్యూలో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ%ఔ% 'గత రెండు నెలల్లో హార్దిక్ పాండ్యా క్రికెట్ ఆడలేదు. జాతీయ జట్టు, దేశవాళీ టోర్నీల్లోనూ బరిలోకి దిగలేదు. నేరుగా ఐపీఎల్‌లోనే ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. దీనిని ఎలా చెప్పాలో తెలియడం లేదు. డబ్బు సంపాదన ముఖ్యమే. అందులో తప్పు ఏమీ లేదు. కానీ ముందుగా రాష్ట్రం, దేశం కోసం ఆడితే బాగుంటుంది' అని అన్నాడు. 'ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఐపీఎల్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. జాతీయ జట్టు, ఐపీఎల్ ఏది ముఖ్యమంటే.. రెండూ కీలకమే అని నేను చెబుతా. డబ్బు కోసమే ఐపీఎల్ ఆడటం సరికాదు. ఏ ఆటగాడైనా దేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా భావించాలి. కానీ కొందరి ఆటగాళ్లలో ఆ భావన ఉండటం లేదు. ఐపీఎల్ ఆడడం కోసం ఒక నెల ముందు విశ్రాంతి తీసుకుని.. సిద్ధమవుతున్నారు. అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు ఐపీఎల్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తే బాగుంటుంది. ఫ్రాంచైజీ క్రికెట్‌ను వదిలేయమని నేను చెప్పడం లేదు కానీ జాతీయ జట్టుకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి' అని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నాడు.

## ఆర్‌సీబీ ప్లేయర్ ఎలీస్ పెర్రీ చరిత్ర

ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ప్లేయర్ ఎలీస్ పెర్రీ చరిత్ర సృష్టించారు. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అత్యుత్తమ బౌలింగ్ గణంకాలు నమోదు చేశారు. డబ్ల్యూపీఎల్ 2024లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పెర్రీ.. తన కోటా 4 ఓవర్లలో కేవలం 15 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టారు. డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటివరకు ఆరు వికెట్స్ ఏ బౌలర్ పడగొట్టలేదు. ఇప్పటివరకు డబ్ల్యూపీఎల్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణంకాల రికార్డు ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండర్ మరిజన్నె కాప్ పేరిట ఉండేది. కాప్ 15 పరుగులు ఇచ్చి 5 వికెట్స్ పడగొట్టారు. మంగళవారం రాత్రి ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌తో కాప్ రికార్డును ఎలీస్ పెర్రీ బ్రేక్ చేసింది. పెర్రీ సాధించిన 6 వికెట్లు కూడా బౌల్డ్‌లు, ఎల్బీ రూపంలో వచ్చినివే. శోభన ఆశ, తారా గాబ్రియెల్లా నోరిస్, కిమ్ గార్త్ కూడా 5 వికెట్స్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో బెంగళూరు 7 వికెట్ల తేడాతో ముంబైపై విజయం సాధించింది. ముంబై నిర్దేశించిన 114 పరుగుల లక్ష్యాన్ని ఆర్‌సీబీ 15 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి మాత్రమే కాదు 115 పరుగులు చేసింది. ఎలీస్ పెర్రీ (40 నాటౌట్), రీచా ఘోష్ (36 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అంతకుముందు ఎలీస్ పెర్రీ (6/15) ధాటికి ముంబై 19 ఓవర్లలో 113 పరుగులకే ఆలౌట్ అయింది. సంజీవన్ సంజన (30), మాథ్యూస్ (26) రాణించారు. ఈ విజయంతో లీగ్‌లో తొలిసారి ప్లేఆఫ్ బెర్తును ఆర్‌సీబీ దక్కించుకుంది.

## ప్రేక్షకులను సైలెంట్ చేస్తా..

ప్రస్తుతం జరుతున్న గుజరాత్ రాష్ట్ర 10వ తరగతి బోర్డు పరీక్షల్లో వరల్డ్ కప్ ఫైనల్ %--% 2023 మ్యాచ్ గురించి ఓ ఆసక్తికర ప్రశ్న వచ్చింది. అహ్మదాబాద్ లో జరిగిన 2023 ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ చూశారా..? అయితే ఆ మ్యాచ్ ను మీ పరిశీలనను బట్టి మ్యాచ్ గురించి ఓ రిపోర్ట్ రాయండి.. అంటూ బోర్డు పరీక్ష ప్రశ్న పత్రంలో 4 మార్కులకు ప్రశ్న వచ్చింది. ఎన్నో అంచనాలతో ఈ సారి భారత జట్టు ఖచ్చితంగా విజయం సాధిస్తుందని సగటు భారత అభిమాని ఎంతో అనుకున్నప్పటికీ, ఫైనల్‌లో మాత్రం ఆస్ట్రేలియా చేతిలో అపజయం పాలైంది. ఒక్క అపజయం లేకుండా ఫైనల్ వరకు వచ్చినా, చివరకు వరల్డ్ కప్ గెలవలేకపోయింది. మొదటగా టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకోవడంతో.. ఓపెనర్ రోహిత్ శర్మ ఎప్పటిలాగే తన దూకుడు ఇన్నింగ్స్ మొదలెట్టాడు. దీనితో కేవలం 31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్ల సహాయంతో 47 పరుగులు చేసి వెనుతిరిగాడు. ఇదే క్రమంలో శుబ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్ ఇద్దరు కేవలం చెరో 4 పరుగులు చేసి తీవ్రంగా నిరాశపరిచారు. ఆపై వెంటవెంటనే 3 వికెట్లు పడడంతో విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ అతి జాగ్రత్తగా ఆచితూచి ఆడారు. ఇలా నెమ్మదిగా ఆడడంతో భారత జట్టు 50 ఓవర్లలో కేవలం 240 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆపై బ్యాటింగ్ మొదలు పెట్టిన డేవిడ్ వార్నర్ 7, మిచెల్ మార్ష్ 15, స్టీవ్ స్మిత్ 4 పరుగులు మాత్రమే జోడించి వెంటవెంటనే అవుట్ కావడంతో కేవలం 47 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది కంగారు టీం. ఈ పరిస్థితులలో టీం ఇండియా గెలవడం ఖాయమని అందరూ అనుకున్నారు. అయితే, ఆస్ట్రేలియా బ్యాటర్స్ ట్రావిస్ హెడ్, మార్నస్ లబుషేన్ లు కలిసి నాలుగో వికెట్ కి ఏకంగా 192 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పడంతో, ఆస్ట్రేలియాకి ఘన విజయం లభించింది. ఆరవసారి వరల్డ్ కప్‌ని గెలుచుకుంది. ఇక ఫైనల్ మ్యాచ్ పరంగా చూస్తే రోహిత్ శర్మ పేలవ కెప్టెన్సీ, బ్యాటింగ్ లో భారత బ్యాటర్ల అతి జాగ్రత్త, టెన్షన్.. ఇలా ప్రతి విషయం కలిసి టీమిండియాకి మరోసారి ఐసీసీ టోర్నీలో నిరాశనే మిగించింది. టీం ఇండియా భారతగడ్డపై ఆడుతున్న సమయంలో వారి ప్రేక్షకులను సైలెంట్ చేస్తా అని చెప్పిన ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ చెప్పినట్టే చేసాడు. అదేవిధంగా గడిచిన సంవత్సరం జూన్ లో భారత్ పై ఐసీసీ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ను కూడా గెలిచిన ప్యాట్ కమ్మిన్స్, నవంబర్ మాసంలో ఐసీసీ వన్డే వరల్డ్ కప్ ఫైనల్ లోనూ భారత జట్టును మడత పెట్టాడు.

## ఢిల్లీ క్యాపిటల్స్‌కు బిగ్ షాక్

### వ్యక్తిగత కారణాల వల్ల హ్యారీ బ్రూక్ దూరం



మరో 10 రోజుల్లో ఐపీఎల్ 2024 సీజన్ ప్రారంభం కానుంది. అయితే ఈలోపే ఢిల్లీ క్యాపిటల్స్‌కు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టు మినీ వేలంలో రూ. 4 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన ఇంగ్లాండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ వ్యక్తిగత కారణాల వల్ల ఈ సీజన్ మొత్తానికి దూరమవుతున్నాడు. ఇప్పటికే ఈ విషయాన్ని ఢిల్లీ ఫ్రాంచైజీకి వెల్లడించాడు. అటు స్వదేశంలో భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన టెస్ట్ సిరీస్‌కి కూడా చివరి నిమిషంలో వ్యక్తిగత కారణాల వల్ల హ్యారీ బ్రూక్ దూరమైన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. గతేడాది సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తరపున ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు హ్యారీ బ్రూక్. 2023లో ఈ ఇంగ్లాండ్ యువ ప్లేయర్ పెర్ఫార్మన్స్‌లను అంచనా వేసుకుని.. గతేడాది వేలంలో ఏకంగా రూ. 13.23 కోట్లు ఇచ్చి కొనుగోలు చేసింది సన్‌రైజర్స్ జట్టు. అయితే హైదరాబాద్ ఫ్రాంచైజీ నమ్మకాన్ని పూర్తిగా వొమ్ము చేశాడు హ్యారీ బ్రూక్. మొత్తం 11 మ్యాచ్‌లు ఆడిన బ్రూక్ ఒక సెంచరీతో కేవలం 190 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో ఐపీఎల్ 2024 వేలానికి ముందు ఆరెంజ్ ఆర్మీ అతడ్ని విడిచిపెట్టింది. ఈ క్రమంలోనే ఢిల్లీ క్యాపిటల్స్ హ్యారీ బ్రూక్‌ను రూ. 4 కోట్లు పెట్టి వేలంలో సొంతం చేసుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా యువ ప్లేయర్ జెక్ ఫ్రాసెర్ మెక్‌గుర్క్.. హ్యారీ బ్రూక్‌ను రీప్లేస్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, ఈ ఏడాది ఐపీఎల్ ద్వారా ఢిల్లీ కెప్టెన్ రిషబ్ పంత్ రీ-ఎంట్రీ ఇస్తున్నాడు.

## రూ.200 కోసం రుమాలీ రోటీలు కాల్చేవాడిని



టీమిండియా స్టార్ బౌలర్, హైదరాబాదీ పేసర్ మహమ్మద్ సిరాజ్ పుట్టిన రోజు ఇవాళ (మార్చి 13). ఈ సందర్భంగా పలువురు క్రికెటర్లు, అభిమానులు, నెటిజన్లు సిరాజ్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. బీసీసీఐ కూడా హైదరాబాదీ పేసర్ కు స్పెషల్ విషెస్ తెలిపింది. అలాగే సిరాజ్ కు సంబంధించిన ఒక స్పెషల్ వీడియోను షేర్ చేసింది. ఇందులో కారు డ్రైవ్ చేస్తూ కనిపించిన సిరాజ్ జీవితంలో తాను పడ్డ కష్టాల గురించి చెబుతూ ఎమోషనల్ అయ్యాడు. 'నా కుటుంబ సభ్యులు చదువుకోవాలని పట్టుబట్టారు. అయితే మేం అద్దె ఇంట్లో నివాసముండే వాళ్లం. ఇంట్లో మా నాన్న మాత్రమే సంపాదిస్తున్న వ్యక్తి. కాబట్టి ఆయనకు తోడుగా నేను పనికి వెళ్ళేవాడిని. ఒక క్యాటరింగ్ లో చేరాను. అక్కడ రుమాలీ రోటీలు కాల్చేవాడిని. ఈ ప్రయత్నంలో చాలా సార్లు నా చేతులు కాలిపోయాయి. రోజుకు రూ. 200 వస్తే 150 రూపాయలు ఇంట్లో ఇచ్చేవాడిని. మిగతా 50 రూపాయలు నా దగ్గరే ఉంచుకునేవాడిని' అని ఎమోషనల్ అయ్యాడు సిరాజ్. మహ్మద్ సిరాజ్ గురించి బీసీసీఐ షేర్ చేసిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. సిరాజ్ జీవితం చాలా స్ఫూర్తిదాయకమంటూ పలువురు ప్రశంసిస్తున్నారు .అలాగే అతనికి పుట్టిన రోజు శుభాకాంక్షలు కూడా తెలుపుతున్నారు. రాబోయే రోజుల్లో భారత క్రికెట్ జట్టుకు గొప్ప విజయాలు అందించాలంటూ సిరాజ్ కుబర్త్ డే విషెస్ చెబుతున్నారు. మహ్మద్ సిరాజ్ ప్రస్తుతం భారత క్రికెట్ జట్టు ప్రధాన ఫాస్ట్ బౌలర్లలో ఒకడు. అతను బీసీసీఐ 'ఏ' గ్రేడ్ ప్లేయర్ కూడా. ఇప్పటివరకు భారత్ తరఫున 27 టెస్టులు, 41 వన్డేలు, 10 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడాడు. భారత్ కు ఎన్నో విజయాలు అందించాడు.



## టీ20 కెప్టెన్సీ నుంచి కమిన్స్ ఔట్!

### ఆసీస్ సంచలన నిర్ణయం.

ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. జూన్ 1 నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక %ు%20 వరల్డ్ కప్ కోసం కొత్త కెప్టెన్‌ని ఎంపిక చేస్తుందని తెలుస్తోంది. గతంలో కెప్టెన్‌గా ఉన్న ప్యాట్ కమిన్స్‌ను సారథ్య బాధ్యతల నుంచి తప్పించనుందని వస్తున్నాయి. సారథ్య బాధ్యతలను డేరింగ్ అండ్ డ్యాషింగ్ బ్యాటర్ మిచెల్ మార్ష్‌కు కట్టబెట్టనున్నట్లు ప్రచారం సాగుతోంది. తాజాగా ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టు కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. రాబోయే %ు%20 ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా జట్టుకు మిచెల్ మార్ష్ నాయకత్వం వహిస్తాడని అభిప్రాయపడ్డారు. దీంతో త్వరలోనే ఆస్ట్రేలియా టీ20 జట్టు కెప్టెన్ మారడం దాదాపు ఖాయం. పాట్ కమిన్స్ నాయకత్వంలో ఆస్ట్రేలియా వన్డే ప్రపంచకప్, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. ఈ నేపథ్యంలో టీ20 జట్టు కెప్టెన్సీ నుంచి కమిన్స్‌ను తప్పించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అయితే 2023 వన్డే ప్రపంచకప్ ముగిసిన తర్వాత పాట్ కమిన్స్ గైర్హాజరీలో జట్టుకు నాయకత్వం వహించిన మిచెల్ మార్ష్ జట్టును అద్భుతంగా నడిపించాడు. మార్ష్ నాయకత్వంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0 తేడాతో కైవసం చేసుకోగా, న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. ఈ రెండు సిరీస్ విజయాలతో మిచెల్ మార్ష్ తన నాయకత్వ లక్షణాలను చాటుకున్నాడు. దీంతో త్వరలో జరగనున్న టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా జట్టుకు సారథ్యం వహించే దిశగా దూసుకుపోతున్నాడు. అందుకే జూన్ 1 నుంచి ప్రారంభం కానున్న క్రికెట్ పోరులో ఆసీస్ జట్టు కెప్టెన్ గా మిచెల్ మార్ష్ కనిపించినా ఆశ్చర్యపోనవసరం లేదు.

## పంజాబ్ కింగ్స్ ఆశలు నెరవేరేనా?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో ఇప్పటివరకు టైటిల్ గెలవని జట్టుగా పంజాబ్ కింగ్స్ నిలిచింది. ఈ జట్టు ఒక్కసారి మాత్రమే ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ, గెలవలేకపోయింది. 2014లో ఈ జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ, కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో ఓడిపోయింది. ఐపీఎల్‌లో నిరంతరం మార్పులు చోటుచేసుకునే జట్టుగా పంజాబ్ నిలిచింది. ఆటగాళ్లను మార్చారు, కెప్టెన్‌ను మార్చారు, అలాగే, కోచింగ్ సిబ్బందిని కూడా మార్చారు. ఈ ఫ్రాంచైజీ ఎవరికైనా దీర్ఘకాలిక పదవీకాలాన్ని అందించడం చాలా అరుదుగా కనిపించింది. ఈసారి కూడా ఫ్రాంచైజీ వేలంలో పలువురు ఆటగాళ్లను



తమ జట్టులో చేర్చుకుంది. అయితే, పంజాబ్ టైటిల్ కరువును తీర్చగలదా లేదా అనేది ప్రశ్నగా మారింది. వేలంలో భారీగా ఖర్చు చేసినా ఫలితం లేకపోవడమే పంజాబ్ చరిత్ర. జట్టు కొత్త సీజన్‌లో ఫలితాలను పొందాలనుకుంటోంది. శిఖర్ ధావన్ కెప్టెన్సీలో జట్టు రానుంది. గత సీజన్‌లో కూడా ధావన్ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ ప్రత్యేక ఫలితాలు రాలేదు. ధావన్‌తో పాటు కగిసో రబాడ, సామ్ కర్రాన్, లియామ్ లివింగ్‌స్టన్, జానీ బెయిర్‌స్టో, అర్ష్‌దీప్ సింగ్, జితేష్ శర్మ వంటి వారి పేర్లు జట్టులో ఉన్నాయి.పంజాబ్ %ఖూా% ప్రారంభించినప్పుడు, ఈ జట్టు యువరాజ్ సింగ్ కెప్టెన్సీలో బరిలోకి దిగింది. తొలి సీజన్‌లోనే ప్లేఆఫ్స్‌కు చేరింది. కానీ, పంజాబ్ జట్టు ఫైనల్స్‌కు చేరుకోలేకపోయింది. జట్టులో యువరాజ్ సింగ్, ఇర్ఫాన్ పఠాన్, మహేల జయవర్ధనే, కుమార సంగక్కర, బ్రెట్ లీ వంటి ఆటగాళ్లు ఉన్నప్పటికీ విజయం సాధించలేకపోయారు. మొదటి సీజన్ తర్వాత, ఈ జట్టు బలహీనంగా మారింది. ప్లేఆఫ్‌లకు వెళ్లడం చాలా కష్టమైన పని అని నిరూపించుకుంది. అయితే, జార్జ్ బెయిలీ కెప్టెన్సీలో, జట్టు 2014 సంవత్సరంలో అద్భుతంగా ఆడింది. అప్పట్లో ఈ జట్టులో వీరేంద్ర సెహ్వాగ్ లాంటి ఆటగాడు కూడా ఉన్నాడు. కానీ, కోల్‌కతా జట్టు ఓనర్ ప్రీతి జింటా కలలను ఎవ్వరూ నెరవేర్చలేకపోయారు. పంజాబ్‌లో మంచి బ్యాట్స్‌మెన్స్ ఉన్నారు. జట్టులో ధావన్ లాంటి ఓపెనర్ ఉన్నాడు. జానీ బెయిర్‌స్టో లాంటి తుఫాను బ్యాట్స్‌మెన్ ఉన్నాడు. మిడిలార్డర్‌లో జట్టుకు నాయకత్వం వహిస్తున్న లివింగ్‌స్టన్ తన తుఫాను బ్యాటింగ్‌తో మ్యాచ్‌ని మలుపు తిప్పగల సత్తా ఉన్నవాడు. జితేష్ శర్మ రూపంలో గొప్ప ఫినిషర్ ఉన్నాడు. వీటన్నింటితో పాటు వేగంగా పరుగులు సాధించగల సత్తా శామ్ కుర్రాన్‌కు ఉంది. అంతే కాకుండా బౌలింగ్‌లో కూడా జట్టుకు రబాడ అనే పేరు ఉంది. అతనికి మద్దతుగా అర్ష్‌దీప్ సింగ్, క్రిస్ వోక్స్, నాథన్ ఎల్లిస్, హర్షల్ పటేల్, రిషి ధావన్ ఉన్నారు. జట్టులో మంచి ఆల్‌రౌండర్లు కూడా ఉండడం ఒక బలం. తుఫాను బ్యాటింగ్‌తో పాటు, లివింగ్‌స్టన్ స్పిన్ బౌలింగ్ కూడా చేయగలడు. అతను లెగ్ స్పిన్నర్, ఆఫ్ స్పిన్ రెండింటినీ సంధిస్తాడు. సికందర్ రజా కూడా తన స్పిన్‌తో సహకరించగలడు. కరణ్‌ను మంచి ఆల్‌రౌండర్‌లుగా పరిగణించారు. సమయం వచ్చినప్పుడు బ్యాట్‌తో సహకరించే సామర్థ్యం రిషి ధావన్‌కు కూడా ఉంది. స్థిరంగా ఆడలేకపోవడమే పంజాబ్ జట్టులోని అతి పెద్ద బలహీనత. కొన్నిసార్లు జట్టు బ్యాటింగ్ పని చేస్తుంది. కొన్నిసార్లు జట్టు బౌలింగ్ పనిచేస్తుంది. ఒకరిద్దరు ఆటగాళ్ల బలంతో క్రికెట్‌లో విజయం సాధించదు. దీని కోసం, మొత్తం జట్టు సహకారం, అవసరం. ఇలాంటి జరగకపోవడంతో పంజాబ్ ఓడిపోతుంది. దీనిపై పంజాబ్ కెప్టెన్ ధావన్, కోచ్ ట్రెవర్ బేలిస్ ఆలోచించాల్సి ఉంటుంది. అదే సమయంలో జట్టులో మంచి స్పిన్నర్ లేకపోవడం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. రాహుల్ చాహర్, హర్‌ప్రీత్ బ్రార్ జట్టుతో ఉన్నారు. అయితే, గత సీజన్‌లలో వారి ప్రదర్శన చాలా బాగాలేదు. జట్టుకు మళ్లీ పార్ట్‌టైమ్ స్పిన్నర్లు రజా, లివింగ్‌స్టన్‌ల సహాయం అవసరం.

## విశ్వరూపం చూపించిన శ్రేయస్ అయ్యర్.!



ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ -2024 లో భాగంగా జరుగుతున్నముంబై %--% విదర్భ ఫైనల్ మ్యాచ్ ?లో విధ్వంసక ఇన్నింగ్స్ ?తో అందరి ఫోకస్ తన పై పడేలా చేశాడు టీమిండియా స్టార్ బ్యాట్స్మెన్ శ్రేయస్ అయ్యర్. గత కొన్ని రోజులుగా అనవసర వివాదంతో ఈయన వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇంగ్లండ్ ?తో జరిగిన టెస్టులో ఘోరమైన ఫామ్? లో ఉన్న ఈయనను పూర్తి సిరీస్ ?కు సెలక్ట్ చేయలేదు బీసీసీఐ. ఈ దెబ్బతో సిరీస్ మధ్యలోనే బెంగళూరులో ఉన్న ఎన్?సీఏకు అతడు తిరిగి వెళ్ళాడు. ఆ సమయంలో అతడు నేషనల్ డ్యూటీలో లేకపోవడంతో రంజీ ట్రోఫీలో ఆడమని శ్రేయస్ అయ్యర్ కి బీసీసీఐ సూచించింది. కాకపోతే శ్రేయస్ గాయం సాకుగా చెప్పి ఎన్?ఏసీ లోనే ఉండిపోయాడు. ఈ కారణం చేత అతడి కాంట్రాక్ట్ ?ను బోర్డు రద్దు చేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఇది ఇలా ఉండగా.., తాజాగా మెరుపు ఇన్నింగ్స్ ?తో అందరి దృష్టిని ఆకర్షించాడు అయ్యర్. ప్రస్తుతం విదర్భ టీంతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ తొలి ఇన్నింగ్స్ ?లో కేవలం 7 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ బాట పట్టాడు. దీంతో మళ్లీ అతని పై పెద్ద ఎత్తున తీవ్ర విమర్శలు వచ్చాయి. కాకపోతే రెండో ఇన్నింగ్స్?లో మాత్రం కేవలం 111 బంతుల్లోనే 95 పరుగులు చేసి తన బ్యాట్ పవర్ ఏంటో చూపించాడు. ఈ ఇనింగ్స్ లో అతడు చేసిన పరుగుల్లో దాదాపు 60 శాతం కేవలం బౌండరీలు, సిక్సుల ద్వారానే అతని ఆట ఏంటో అర్థం అవుతుంది. ఇందులో 10 ఫోర్లు, 3 సిక్సులను కొట్టాడు.ఈ మ్యాచ్ లో శ్రేయస్ అయ్యర్ తో పాటు ముషీర్ ఖాన్ (136), ముంబై కెప్టెన్ అజింక్యా రహానె (73), షామ్స్ ములానీ (50 లి) లతో రాణించడంతో ముంబై రెండో ఇన్నింగ్స్? లో 418 పరుగుల భారీ స్కోరును అందుకుంది. దింతో ఫైనల్? లో గెలవాలంటే విదర్భ టీంకి 537 పరుగుల టార్గెట్ వచ్చింది. ఇక ప్రస్తుతం ఉన్న మ్యాచ్ పరిస్థితి చూస్తే మాత్రం ముంబై విజయం సునాయాసంగానే కనపడుతోంది. ఈ దెబ్బకు సెన్సేషనల్ నాక్ ఆడిన అయ్యర్ ?ను సోషల్ మీడియాలో నెటిజన్స్ పొగడ్తలతో మెచ్చుకుంటున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com